

ఉమ్మడి కర్నూలు రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు పురిటిగడ్డ. కరువు నేలకు సస్యశ్యామలం చేసే కేసీ కాలువ, గాలేరు-నగరి ప్రాజెక్టు, హంద్రీ-నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం.. ప్రాజెక్టు ఏదైనా కందనవోలు ముంగిట నుంచి జల అడుగులు పడాలి. అంతటి ప్రాధాన్యత కలిగిన సీమ ప్రాజెక్టులకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శించారు. నిధులు లేక పలు ప్రాజెక్టులు అటకెక్కించారు. కనీసం నిర్వహణకు కూడా నిధులు ఇవ్వని దైన్య పరిస్థితిని కల్పించారు. 2024 ఎన్నికల ఏడాది.. ఫిబ్రవరి 7న ఆనాటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో నిధులు ఇవ్వకుండా నిరాశే మిగిల్చారు. జూన్ 12న సీఎం చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరాక సాగునీటి ప్రాజెక్టులు నూతన కళను సంతరించుకున్నాయి. తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోతే మన రాష్ట్రం కాకపోయినా సీఎం చంద్రబాబు ప్రాజెక్టుల గేట్ల నిపుణుడు కన్నయ్యను పంపి కందనవోలు పశ్చిమ రైతుల కన్నీళ్లు తుడిచారు. నవంబరు 11న టీడీపీ కూటమి ప్రభుత్వం ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్‌లో జిల్లా ప్రాజెక్టులకు రూ.445.81 కోట్లు కేటాయించారు. సాగు నీటి సంఘాల ఎన్నికలు పూర్తి చేశారు. కాలువల మరమ్మతులకు చర్యలు చేపట్టారు. శ్రీశైలం డ్యాం ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. 2024లో కందనవోలు సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులపై పరిశీలిస్తే..


హంద్రీనీవా కాలువ



నీళ్లు.. నిధులు..!



- వైసీపీ హయాంలో పడకేసిన ప్రాజెక్టులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రత్యేక దృష్టి
- 2024-25 బడ్జెట్‌లో రూ.445.81 కోట్ల కేటాయింపు
- హంద్రీనీవా కాలువ విస్తరణకు వేగంగా చర్యలు

కర్నూలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), గాజులదిన్నె ప్రాజెక్టు, కర్నూలు-కడప (కేసీ) కాలువ, తెలుగుగంగ ప్రాజెక్టు, శ్రీశైలం కుడిగట్టు కాలువ (ఎస్సార్బీసీ) ప్రధాన సాగు, ఆలూరు బ్రాంచ్ కాలువ, శివ భాష్యం ప్రాజెక్టు, హంద్రీనీవా కాలువ.. వంటి సాగునీటి ప్రాజెక్టులు ఉన్నాయి. ఆయా నీటి వనరుల కింద 6.56 లక్షల ఎకరాలకు సాగు నీరందాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాయలసీమ దుర్భిక్ష నివారణ ప్రాజెక్టు పేరిట ఉన్న ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కర్నూలు జిల్లాలో పశ్చిమ పల్లెసీమలకు సాగు, తాగు నీరందించే లక్ష్యంగా చేపట్టి వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ ప్రాజెక్టులు అటకెక్కించారు. నాడు జగన్ ప్రభుత్వం వల్ల కందనవోలు ప్రాజెక్టులు అంతులేని నిర్లక్ష్యానికి గురయ్యాయి. జూన్ 12న సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం రావడంతో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, కొత్త ప్రాజెక్టుల నిర్మాణాలపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఆ దిశగా ప్రభుత్వం వేగంతమైన చర్యలకు ఉపక్రమించింది. ఆగస్టులో తుంగభద్ర డ్యాం 19వ నంబరు గేటు కొట్టుకుపోవడంతో కర్నూలు జిల్లాలో ఎల్లెల్సీ ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది. సీఎం చంద్రబాబు తక్షణమే క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడును టీబీపీ డ్యాంకు పంపించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించారు. 30 టీఎంసీలు కడలిపాలు కాకుండా రక్షించారు. కరువుపల్లె రైతుల సాగు ఆశలు పదిలం చేశారు.


వేదావతి ప్రాజెక్టు పైపులు ఇలా పడేశారు

వైసీపీ హయాంలో నిర్లక్ష్యం

ఎన్నికల ఏడాది.. అందులోనూ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఉమ్మడి జిల్లా వాసే. బడ్జెట్‌లో నిధులకు ఢోకా ఉండదని ఆశపడడంలో తప్పులేదు. ఈ ఏడాది ఆరంభం ఆరు నెలలు వైసీపీ అధికారమే ఉంది. ఫిబ్రవరి 7న నాటి ఆర్థిక మంత్రి బుగ్గన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు నిధులు కేటాయింపులు ఎండమావులే అయ్యాయి. హంద్రీనీవా కాలువ నుంచి 68 చెరువుల నింపే ప్రాజెక్టు గత టీడీపీ ప్రభుత్వం చేపడితే.. ఆ ప్రాజెక్టు తానే తెచ్చినట్లుగా బడ్జెట్ ప్రసంగంలో చెప్పారే తప్పా నిధుల ఊసే లేదు. రూ.వేల కోట్లు బకాయి పెట్టారు. గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకం వంటి ఎత్తిపోతల పథకాల నిర్వహణకు నిధులు ఇవ్వలేదు.

పుచ్చకాయలమడ లిఫ్ట్‌కు రూ.6.50 కోట్లు

పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామంలో అక్టోబరు 1న ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించారు. ప్రజావేదిక సభలో పాల్గొన్నారు. మీ గ్రామానికి ఏమి కావాలో కోరుకోమని రైతులను చంద్రబాబు అడిగారు. 'మా గ్రామం పక్కనే హంద్రీనీవా కాలువ ప్రవహిస్తుంది.. మా పంట పొలాలకు చుక్కనీరు అందక ఏటేటా పంటలు ఎండిపోయి నష్టపోతున్నాం.. లిఫ్ట్ ఏర్పాటు చేసి సాగునీరు ఇవ్వాలి' అని రైతులు కోరారు. ఈ మేరకు జలవనరుల శాఖ ఇంజనీర్లు రూ.6.50 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం పంపారు. 800 ఎకరాలకు సాగునీరు లక్ష్యంగా హంద్రీనీవా కాలువ 121 కిలోమీటర్ల వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలోనే ఈ ప్రాజెక్టు కార్యారూపం దాలుస్తుందని అంటున్నారు. అలాగే.. రాయలసీమలో 6.50 లక్షల ఎకరాలకు సాగునీటి ఆశయంలో నిర్మించిన హంద్రీనీవా కాలువ విస్తరణకు రూ.1,500 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

టీడీపీ కూటమి వచ్చాక ప్రాజెక్టులకు జీవం

ఈ ఏడాది సగంలో జూన్ 12న సీఎం చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు జలజీవం వచ్చింది. సీమ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించారు. కూటమి ప్రభుత్వంలో నవంబరు 11న ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ 2024-25 పూర్తి స్థాయి బడ్జెట్ కేటాయించారు. ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులు రూ.445.81 కోట్లు కేటాయించారు. కేసీ కెనాల్, కుందూ, నిప్పులవాగు రూ.253.10 కోట్లు కేటాయించడం కొసమెరుపు. వైసీపీ ఐదేళ్ల పాలనలో మరమ్మతులకు నోచుకోని గురురాఘవేంద్ర ఎత్తిపోతల ప్రాజెక్టు సహా తుంగభద్ర ప్రాజెక్టు దిగువ కాలువ (ఎల్లెల్సీ), ఆర్డీఎస్, వేదవతి, గాజులదిన్నె ప్రాజెక్టులకు రూ.115.39 కోట్లు కేటాయించారు. గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్యం పెంపు పనులకు వైసీపీ హయాంలో బిల్లులు ఇవ్వక పనులు ఆపేస్తే కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.11.79 కోట్లు కేటాయించి పనులు ప్రారంభానికి బీజం వేసింది. శ్రీశైలం డ్యాం శాశ్వత మరమ్మతులకు ప్రపంచ బ్యాంక్ ఆమోదం తెలిపింది.

మిగతా 6లో..


ఆర్డీఎస్ కుడి కాలువ హెడ్ స్లూయిస్

చిప్పగిరి, మద్దికెర మండలాలకు అవార్డులు

రూ.2.5 కోట్లు ప్రకటించిన నీతి ఆయోగ్



కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన సూచికల్లో ప్రగతి సాధించి చిప్పగిరి, మద్దికెర మండలాలు దేశస్థాయిలో మంచి ర్యాంకులు సాధించాయి. దీంతో ఉత్తమ ర్యాంకులు సాధించిన చిప్పగిరి మండలానికి రూ.1.50 కోట్లు, మద్దికెర మండలానికి రూ.కోటి మొత్తాన్ని నీతి ఆయోగ్ ప్రకటించింది. ఇందుకు సంబంధించిన వివరాలను కలెక్టర్ పి.రంజిత్ బాషా శుక్రవారం వెల్లడించారు. నీతి ఆయోగ్ దేశంలో ఎంపిక చేసిన 471 యాస్పిరేషనల్ బ్లాకుల్లో నిర్దేశించిన సూచికల పురోగతిని పరిశీలించి ర్యాంకులను ప్రకటించిందన్నారు. దేశంలో ఎంపిక చేసిన 471 బ్లాకుల్లో జూన్ త్రైమాసికం-2024లో చిప్పగిరి మండలం దేశంలో 36వ ర్యాంకు, సౌత్‌జోన్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలు)లో మొదటి ర్యాంకు సాధించిందన్నారు. అదేవిధంగా సెప్టెంబరు త్రైమాసికం-2024లో మద్దికెర మండలం దేశంలో 18వ ర్యాంకు, సౌత్ జోన్ స్థాయిలో మూడో ర్యాంకు సాధించిందన్నారు. జిల్లాలోని ఈ రెండు మండలాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2024-జూన్, సెప్టెంబరు త్రైమాసికంలో ప్రథమ స్థానంలో నిలవడం విశేషమన్నారు.

నేడు జడ్పీ స్థాయి సంఘాల సమావేశాలు

కర్నూలు, న్యూసిటీ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు శనివారం నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో జి.నాసర రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీలోని మినీ సమావేశ భవనంలో ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని పేర్కొన్నారు. ఉదయం 10.30నుంచి 11.30 గంటల వరకు రెండో స్థాయి సంఘం, 11.30 నుంచి 12 గంటల వరకు మూడో స్థాయి సంఘం, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు 6వ స్థాయి సంఘం, మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకు 4వ స్థాయి సంఘం, 3 గంటల నుంచి 4 వరకు 5వ స్థాయి సంఘం, 4 నుంచి 6 గంటల వరకు 1,7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈవో తెలిపారు.

ఇక రాజకీయాలకు దూరం

వెల్లడించిన కర్నూలు వైసీపీ ఇన్‌చార్జి ఇంతియాజ్‌బాషా



కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి రాజకీయాలకు దూరంగా ఉంటానని విశ్రాంత ఐఏఎస్, కర్నూలు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఇంతియాజ్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని నెలల క్రితం కర్నూలు నగర ప్రజలకు సేవా చేయాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశానని ఆయన పేర్కొన్నారు. కొంతకాలంగా బంధుమిత్రులు, శ్రేయోభిలాషులతో చర్చించి ఒక నిర్ణయానికి వచ్చానని తెలిపారు. విశ్రాంత అధికారిగా, సామాజిక స్పృహ కలిగిన వ్యక్తిగా, సాహితీ వేత్తగా మెరుగైన సమాజం కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు. గత ఆరు నెలలుగా సహకారం అందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో సామాజిక అసమానతలు, రుగ్మతలను రూపుమాపేందుకు, పర్యావరణ కాలుష్యం తగ్గించేందుకు స్వచ్ఛంద సంస్థలను కలుపుకొని పని చేయాలని నిర్ణయించుకున్నట్లు ఇంతియాజ్ తెలిపారు.

30 నుంచి దేహదారుఢ్య పరీక్షలు

ఎస్పీ జి. బిందుమాధవ్



మాట్లాడుతున్న ఎస్పీ జి.బిందుమాధవ్

కర్నూలు క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా కానిస్టేబుళ్ల అభ్యర్థులకు ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 1 వరకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎస్పీ జి.బిందుమాధవ్ తెలిపారు. ఇందుకు స్థానిక ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో అన్ని ఏర్పాట్లను పోలీసు అధికారులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫిజికల్ మెజర్మెంట్ అండ్ ఎఫీషియన్సీ పరీక్షలను ప్రణాళికబద్ధంగా నిర్వహించాలన్నారు. పరీక్షల నిర్వహణ సిబ్బంది బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఏపీఎస్ఎల్ఆర్‌బీ ఆదేశాలు, నియమ నిబంధనల మేరకు ఈ పరీక్షలు సవ్యంగా జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఉద్యోగం సాధించాలనే ఒత్తిడిలో అభ్యర్థులు ఉంటారని, వారి పట్ల మర్యాదగా, సహనంతో వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. ఈ దేహదారుఢ్య పరీక్షలకు సుమారు 10 వేల మంది అభ్యర్థులు హాజరు కావచ్చన్నారు. అభ్యర్థులకు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత బయోమెట్రిక్, ఎత్తు, ఛాతి వంటి ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు, ఫిజికల్ ఎఫీషియన్సీ టెస్టులు 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు ఉంటాయని తెలిపారు. రిజల్ట్ కౌంటర్ వరకు అంచెలంచెలుగా సమగ్రంగా విధులు నిర్వర్తించేలా అవగాహన కల్పించారు.

అభ్యర్థులు ఆయా తేదీల్లో నిర్దేశిత సమయంలోనే చేరుకోవాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు వెంట తీసుకురావాలన్నారు. ఏమైనా సందేహాలు, సమస్యలుంటే పోలీసు ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో అడిషినల్ ఎస్పీ అడ్మిన్ హుశేన్‌పీరా, ఏఆర్ అడిషినల్ ఎస్పీ కృష్ణమోహన్, జిల్లా పోలీసు కార్యాలయం సూపరింటెండెంట్లు, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోగా డాక్టర్ పి.శాంతికళ


డాక్టర్ భాస్కర్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళ

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారిగా డాక్టర్ పి.శాంతికళ బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం ఆమె డాక్టర్ ఎల్.భాస్కర్ నుంచి బాధ్యతలను స్వీకరించారు. కడప జిల్లా జమ్మలమడుగులో డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పని చేస్తున్న డాక్టర్ పి.శాంతికళ సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొంది కర్నూలు డీఎంహెచ్‌వోగా వచ్చారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో నిర్వహిస్తున్న అసంక్రమిత వ్యాధుల సర్వే ఎన్‌సీడీ 3.0 వేగవంతం చేయాలన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతి వందశాతం ఉండేటట్లు అధికారులు, సిబ్బంది పని చేసి జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచాలన్నారు.

అలా కానిచ్చేశారు..!

- విద్యుత్ చార్జీలు పెంపుపై వైసీపీ నిరసనలు
- మెజార్టీ నియోజకవర్గాల్లో జనస్పందన కరువు
- కర్నూలు, పత్తికొండ, ఎమ్మిగనూరులో విభేదాలు
- పలువురు నాయకులు ర్యాలీకి దూరం

కర్నూలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉండగా ఏ చిన్న కార్యక్రమం చేపట్టినా వేలాది మందిని తరలించేవారు. బలవంతంగా జన సమీకరణ చేసి వారంతా మా వెంటే ఉన్నట్లు కలరింగ్ ఇచ్చారు. ఎన్నికలకు ముందు జగన్ సీఎం హోదాలో నిర్వహించిన సిద్ధం సభలకు ఆర్టీసీ బస్సులు పెట్టి బలవంతంగా తరలించారు. అధికారం పోయాక ఆ పార్టీ నిర్వహించే కార్యక్రమాలకు ఆశించిన మేరకు జనం రాకపోవడంతో ముఖ్యనాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ముఖ్య నాయకుల మధ్య అంతర్గత విభేదాలు వైసీపీని వెంటాడుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకున్న విద్యుత్ నిర్ణయాలు, చేసిన అప్పుల పాపాలే నేడు ప్రజలపై విద్యుత్ చార్జీల భారం పడుతోందని, ఆ పాపం వైసీపీ, ఆనాటి సీఎం జగన్‌నే అని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యుత్ చార్జీలు పెంచారంటూ వైసీపీ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో ఆ పార్టీ ఇన్‌చార్జిలు ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. ఒకటి రెండు నియోజకవర్గాల్లో ఆశించినమేర వైసీపీ శ్రేణులు పాల్గొన్నప్పటికీ మెజార్టీ నియోజకవర్గాల్లో వందల జనంతో అలా ముగించారు. వారికి కూడా బలవంతంగా తరలించారు. ఎమ్మిగనూరులో వైసీపీ ఇన్‌చార్జి బుట్టారేణుక ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ర్యాలీకి 150 మందికి పైగా వచ్చారని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. అయితే వంద కూడా దాటలేదని తెలుస్తోంది. ఈ ర్యాలీకి మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, తనయుడు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి దూరంగా ఉన్నారు. పత్తికొండలో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన వైసీపీ ర్యాలీ పేలవంగా ముగిసింది. ఆ పార్టీ సీనియర్ నాయకులు మురళిధర్‌రెడ్డి, రామచంద్రారెడ్డిలు దూరంగా ఉన్నారు. అధికారం కోల్పోయాక చేపట్టిన తొలి కార్యక్రమంలోనే విభేదాలు భగ్గుమన్నాయి. కర్నూలులోనూ అదే పరిస్థితి ఉంది. వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి ర్యాలీ నిర్వహించి విద్యుత్ డీఈఈకి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ దూరంగా ఉన్నారు. ఉద్దేశపూర్వంగానే ఎస్వీ వర్గం ఆయనను దూరం పెట్టిందని, ముస్లిం నాయకులు వైసీపీకి అవసరం లేదా? హఫీజ్‌ఖాన్ వర్గం గుర్రుగా ఉంది. వైసీపీ తొలి ర్యాలీ సమయంలోనే పోయిన ఎన్నికల్లో ఉద్యోగానికి రాజీనామా చేసి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ ఆ పార్టీకి రాజీనామా చేయడం, రాజకీయాలకు స్వస్తి చెబుతున్నానని ప్రకటించారు. కోడుమూరు నియోజకవర్గంలో ఆ పార్టీ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీశ్ ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసన ర్యాలీకి కూడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి దూరంగా ఉన్నారు. అధికారంలో ఉండగా విచ్చలవిడిగా విద్యుత్ చార్జీలు పెంచి జనంపై మోయలేని భారం వేశారు.. రాజకీయాల కోసం ఇప్పుడు ర్యాలీలు అంటూ ప్రజలను మోసం చేస్తున్నారని సామాన్యులు చర్చించుకోవడం కొసమెరుపు.


ఆదోనిలో వినతిపత్రం ఇస్తున్న సాయిప్రసాద్ రెడ్డి

బొమ్మ పలుకుద్ది..!

- తాకగనే వన్యప్రాణుల అరుపులు, వాటి సమగ్ర సమాచారం ప్రత్యక్షం
- బైర్లూటి ఎకో టూరిజంలో ఆకట్టుకునేలా పర్యావరణ విద్యా కేంద్రం


పర్యావరణ కేంద్రంలో ప్రదర్శించిన పులి ప్రతిమ

టచ్ చేస్తే చాలు బొమ్మ పలుకుతుంది. ముట్టుకోగానే ఆ జంతువు అసలు అరుపు వినబడుతుంది. ఇటువంటి విచిత్రమైన వన్యప్రాణుల బొమ్మలకు బైర్లూటి ఎకో టూరిజం కేంద్రంగా మారింది. పర్యావరణ ప్రేమికులకు వింత అనుభూతి కలిగిలే అటవీ శాఖ ఇక్కడ చర్యలు చేపట్టింది. ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలో బైర్లూటి ఎకో టూరిజంను 2017లో ఏర్పాటు చేశారు. నిర్దిష్టప్యాకేజీని నిర్ణయించి పర్యాటకులు అడవిలో గడిపేలా కాటేజీలను కూడా అందుబాటులో ఉంచారు. అదే క్రమంలో జంగిల్ సఫారీ పేరిట ఓపెన్ టాప్ జీపులో విహరించే అవకాశం కూడా కల్పించారు. అడవి అందాలు, వన్యప్రాణులను వీక్షిస్తూ ఆహ్లాదంగా ముందుకు సాగవచ్చు.

ఆత్మకూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రశాంతమైన వాతావరణంలో ప్రకృతి అందాల నడుమ నిర్మించిన పర్యావరణ విద్యా కేంద్రం ఆశ్చర్యానికి కలిగించేలా ఉందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. పెద్దపులి, చిరుత, ఎలుగుబంటి, కృష్ణజింక, దుప్పులు, కణితి, మణుబోతు, రేసు కుక్కలు, చుక్కల దుప్పి, నక్కలు, కొండముచ్చు, కొండచిలువ, నెమలి, అడవికోడి, ముళ్లపంది ఇలా పలు రకాల వన్యప్రాణులతోపాటు పక్షులు, క్షీరదాల బొమ్మలను అసలైనవే అన్నట్లుగా రూపొందించారు. వాటి పరిధిలో టెక్నాలజీతో కూడిన నాలుగు మానిటర్లను ఏర్పాటు చేసి ఒక్కో మానిటర్‌కు ఆ సమీపంలో ఉండే జంతువులు చిత్రాలను స్ర్కీన్‌లో కనిపించేలా రూపొందించారు. మానిటర్‌లో కనిపించేలా జంతువు లేదా పక్షుల ఫొటోను టచ్ చేసినట్లయితే మానిటర్ స్టాండ్‌కు ఏర్పాటు చేసిన లైట్ నుంచి వెలుతురు వస్తుంది. ఏ జంతువు స్ర్కీన్‌పై క్లిక్ చేశామో ఆ జంతువుపై లైటింగ్ పడేలా అమర్చారు. అంతేకాదు.. తక్కువ లైటింగ్‌తోపాటు సైలెంట్‌గా ఉండే ఈ సెంటర్‌లో ఒక్కసారిగా ఆ జంతువుపై వెలుతురు పడి అరుపు వినిపించేలా సెట్ చేశారు. అదే క్రమంలో ఆ జంతువు లేదా పక్షికి సంబంధించిన సమగ్ర వివరాలు కూడా స్ర్కీన్‌పై ప్రత్యక్షమయ్యేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. అక్కడ అమర్చిన బరువు, ఎత్తు కొలిచే మెషిన్ల వద్ద సరిచూసుకుంటే మన ఎత్తు, బరువు ఏ జంతువుతో పోలి ఉన్నామో అందులో కనిపించేలా వాటిని అమర్చారు. నల్లమల చెంచుల జీవన విధానం ప్రతిబింబించే ప్రతిమలను కూడా అందులో పొందుపర్చారు. ఇలా అత్యాధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేయబడిన ఎన్విరార్‌మెంటల్ ఎడ్యుకేషన్ సెంటర్ బైర్లూటి ఎకో టూరిజం వచ్చే పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది.


చెంచుల జీవన విధానం ప్రతిబింబించేలా..



బైర్లూటిలోని పర్యావరణ విద్యా కేంద్రం

పర్యాటకుల మధురానుభూతి కోసమే..

బైర్లూటి ఎకో టూరిజానికి వచ్చే పర్యాటకులు జంగిల్ సఫారీకి వెళ్తుంటారు. కొన్ని సందర్భాల్లో సఫారీలో ఏఒక్క వన్యప్రాణి కూడా కనిపించకపోవడంతో వారు కొంత నిరుత్సాహానికి గురయ్యే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎకో టూరిజం వద్ద ఏర్పాటు చేసిన పర్యావరణ విద్యా కేంద్రంలో నల్లమలలో సంచరించే ప్రధానమైన జంతువులు, పక్షుల ప్రతిమలను ఏర్పాటు చేసి వాటి అరుపులను (గాండ్రిపులను) స్వయంగా వీక్షిస్తూ వినేలా ఏర్పాటు చేశాం. ఇది పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఇక్కడ ఉపయోగించిన టెక్నాలజీని చూసి పర్యాటకులే ఆశ్చర్యానికి లోనవుతున్నారు.

\- సాయిబాబా, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్








ఆకట్టుకునేలా వన్యప్రాణుల ప్రతిమలు


మానిటర్‌లో కనిపిస్తున్న వన్యప్రాణుల చిత్రాలు

టిఫిన్ ఎలా ఉందమ్మా?

అన్న క్యాంటీన్ల ఆహార నాణ్యతపై నగర పాలక కమిషనర్ ఆరా

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): టిఫిన్ టేస్ట్ ఎలా ఉందమ్మా? అంటూ అన్న క్యాంటీన్ల వద్ద అల్పాహారం చేస్తున్న ప్రజలను నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆరా తీశారు. అల్పాహార రుచి, నాణ్యతలను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం కొండారెడ్డి బురుజు వద్ద అన్న క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. క్యాంటీన్ల వద్ద ఎప్పటికప్పుడు స్వచ్ఛత పనులు చేపడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. పేదలకు మూడు పూటలా రుచికరమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించిందన్నారు.


అల్పాహార రుచులపై ప్రజలను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ రవీంద్రబాబు

ఉర్దూ భాషకు జీవం పోసిన కవి మీర్జా గాలిబ్

ఉర్దూ వర్సిటీలో జయంతి వేడుకల్లో ఇద్రిస్ అహమ్మద్


ఉర్దూ వర్సిటీలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న అతిథులు

కర్నూలు అర్బన్, డిసెంబర్ 27(ఆంధ్రజ్యోతి): దేశంలో ఉర్దూ భాషాకు జీవం పోసిన కవి మీర్జా గాలిబ్ అని ఢిల్లీలోని గాలిబ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ మహమ్మద్ ఇద్రిస్ అహమ్మద్ కొనియాడారు. శుక్రవారం నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో ఉర్దూ కవి మీర్జా గాలిబ్ జయంతి వేడుకను పురస్కరించుకుని గాలిబ్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం హైబ్రిడ్ (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్)పద్ధతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి, ప్రొఫెసర్ పీఎస్ షావళీఖాన్ మాట్లాడుతూ ఉర్దూ సాహిత్య చరిత్రలో గొప్ప కవుల్లో ఒకరైన మీర్జాను స్మరించుకోవడానికి గాలిబ్ డేను జరుపుకోవడం అభినందనీయమన్నారు. రిజిస్ట్రార్ లోక్‌నాథ్ మాట్లాడుతూ గాలిబ్ తన గజల్స్, ద్విపదల ద్వారా భావోద్వేగాలను సంగ్రహించడానికి ఎంతో తపన పడ్డారన్నారు. వర్సిటీ పాలక మండలి సభ్యులు జీఎండీ ఇబ్రహీమ్, నవీద్ పర్వేజ్, ఆజ్రాజావేద్, ఇక్బాల్ ఖుస్రో ఖాద్రీ, సయ్యద్ జహీర్ అహమ్మద్ పాడిన గేయాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో ఉర్దూ శాఖ అధ్యక్షుడు జె. మొహనుద్దీన్ హుస్సేనీ, డాక్టర్ అమతుర్ రహీమ్, మాజీ రిజిస్ట్రార్ సత్తార్ సాహెబ్, కంట్రోలర్ ఖాసీం ఆలీ, కవులు, భాషా ప్రేమికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవనకొండ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోండి

ఆర్డీవోను ఆదేశించిన కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించిన దేవనకొండ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా పత్తికొండ ఆర్డీవోను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి హౌసింగ్, రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్, పంచాయతీ రాజ్, సీసీ రోడ్లు, ఉపాధి హామీ, ఎంఎస్ఎంఈ సర్వే తదితర అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నిర్మిస్తున్న పంచాయతీ రాజ్ ఇంటర్నల్ సీసీ రోడ్ల పనులకు సంబంధించి జిల్లాలో 812 సీసీ రోడ్ల పనులు, 17 అప్రోచ్ రోడ్లు పనులకు గానూ ఇప్పటి వరకు 682 పనులు పూర్తి చేసి 82 శాతం పురోగతి సాధించి రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉన్నామన్నారు. కోడుమూరు చిప్పగిరి, ఓర్వకల్లు, నందవరం, ఎమ్మిగనూరు, ఆదోని, వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాలు ఉపాధి పనులు కల్పించడంలో చాలా వెనుకబడి ఉన్నారని, చిన్న చిన్న కారణాలు చెబుతూ పనులు కల్పించకపోవడం ఏమిటని అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. వీసీలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, డ్వామా పీడీ వెంకట రమణయ్య, డీపీవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

పరీక్ష పే చర్చ వంద శాతం నమోదవ్వాలి

జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పరీక్ష పే చర్చ వంద శాతం నమోదవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి జనవరి 14వ తేదీ వరకు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఉందన్నారు. పరీక్షల ఒత్తిడిని తగ్గించడానికి ఉద్దేశించిన ఈ కార్యక్రమాన్ని ప్రచారం చేయడానికి ప్రోత్సహించడానికి పాఠశాలలు వినూత్న చర్యలను అవలంబించాలని సీబీఎస్ఈ ఇప్పటికే కోరిందని తెలిపారు. ఈ పోటీకి గరిష్ట సంఖ్యలో విద్యార్థులు నమోదయ్యేలా చూడాలని ఇదివరకే ఎంఈవో, హెచ్ఎంలను సమావేశాలు నిర్వహించి ఆదేశించామన్నారు. 2025 జనవరిలో ఢిల్లీలోని భారత్ మండపంలో పరీక్షా పే చర్చా-2025 జరగనుందని, ఈ పరీక్ష పే చర్చా 8వ ఎడిషనల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ప్రధాని ముఖాముఖి మాట్లాడుతారని వెల్లడించారు. రాబోవు మూడు రోజుల్లో వంద శాతం పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మెప్మా సీఎంఎం విజయభాస్కర్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి కోరారు. నైపుణ్య అభివృద్ధి సహకారంతో శిక్షణ పొందేవారి కోసం పేర్ల నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం బాలభవన్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్లంబింగ్, కార్పెంటరీ, ఎలక్ట్రికల్, వాటర్ ప్యూరిఫైర్ సర్వీసెస్, ఏసీ మెకానిక్స్, రిఫ్రిజిరేటర్ రిపేర్, వాషిన్‌మెషిన్ సర్వీస్, టీవీ రిపేర్, బ్యూటీషియన్స్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ లోపల చిన్నపార్కు పక్కనే ఉన్న బాలభవన్ కార్యాయలంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సీసీఐ కొనుగోళ్లు పునఃప్రారంభం

మళ్లీ మూడు రోజులు సెలవు

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతులకు కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్న కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మూడు రోజుల సెలవు అనంతరం శుక్రవారం కొనుగోళ్లను ప్రారంభించింది. ఒక్కరోజే కొనుగోలు చేసి నేడు శని, ఆదివారంతో పాటు సోమవారం అమావాస్య కావడంతో మళ్లీ మూడు రోజుల కొనుగోళ్లను నిలుపుదల చేసింది. ఇప్పటికే మార్కెట్‌లో మద్దతు ధర కంటే పత్తికి తక్కువ ధర పలుకుతుంది. కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదని పత్తి రైతులు వాపోతున్నారు. మరోవైపు నిబంధనల సాకుతో విక్రయ కేంద్రాలకు తెచ్చిన పత్తిని తిరస్కరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు 6300 మంది రైతుల నుంచి 1.47 లక్షల క్వింటాల పత్తిని రైతుల నుంచి సీసీఐ కొనుగోలు చేసింది.


సిరుగుప్ప రహదారులోని సీసీఐకి విక్రయించేందుకు వచ్చిన పత్తి వాహనాలు

నీళ్లు.. నిధులు..!


గాజులదిన్నె జలాశయం

(5వ పేజీ తరువాయి)

వైసీపీ హయాంలో కేంద్ర ప్రభుత్వం నిధులు వినియోగించుకోవడంలో ఘోర వైఫల్యం చెందితే.. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ ఆరు నెలల్లోనే కేంద్ర ప్రభుత్వం నిధులు సద్వినియోగం చేసుకొని ఆయా ప్రాజెక్టుల మరమ్మతులు, ఆధునికీకరణకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా మూడు దశల్లో సాగు నీటి సంఘాల ఎన్నికలను పూర్తి చేసింది. ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన (పీఎంకేఎస్‌వై), ప్రపంచ బ్యాంకు నిధులతో కాలువల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. పీఎంకేఎస్‌వై రిపేర్స్-రెనోవేషన్-రిస్టోరేషన్ (ఆర్ఆర్ఆర్) లో భాగంగా మేజర్, మైనర్ ప్రాజెక్టుల కింద కాలువలు, సిస్టమ్ ట్యాంకుల శాశ్వత మరమ్మతులు, ఆధునికీకరణ కోసం ప్రతిపాదనలు తయరు చేయమని ఇప్పటికే ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో దాదాపుగా రూ.రూ.1,558 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. ఈ ఆరు నెలల్లోనే చంద్రబాబు ప్రభుత్వం నీటి వనరుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది.

టీడీపీ కూటమి ప్రభుత్వం ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు కేటాయింపులు రూ.కోట్లలో..

ప్రాజెక్టులు	బడ్జెట్
ఎల్లెల్సీ, ఆర్డీఎస్, వేదావతి ప్రాజెక్టులు	13.00
కేసీ కెనాల్, కుందూ, నిప్పులవాగు	253.10
ఎస్ఆర్‌బీసీ	44.06
గురురాఘవేంద్ర ప్రాజెక్టు	69.04
68 చెరువులు	20.00
గాజులదిన్నె ప్రాజెక్టు	11.79
శ్రీశైలం జల విద్యుత్ కేంద్రం	2.23
సిద్ధేశ్వరం ఎత్తిపోతల పథకం	6.29
శ్రీశైలం ప్రాజెక్టు	26.30
మొత్తం	**445.81**

2025లో ఈ ప్రాజెక్టులపై దృష్టి సారించాలి

- ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగు నీరు, 196 గ్రామాలకు తాగునీరు అందించాలని గత చంద్రబాబు ప్రభుత్వం వేదావతి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నిర్మాణానికి 2019లో రూ.1,942.38 కోట్లు మంజూరు చేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక పనులు అటకెక్కాయి. నూతన సంవత్సరంలో పనులు మొదలు పెట్టాలి.
- మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లోనే వలసల నివారణ కోసం గత టీడీపీ ప్రభుత్వం ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. 2019 జనవరిలో రూ.1,985.42 కోట్లు మంజూరు చేసింది. వైపీపీ వచ్చాక పనులు ఆపేశారు. 2025లో ఆర్డీఎస్ పనులకు శ్రీకారం చుట్టాలి.
- తుంగభద్ర నదిపై 20 టీఎంసీలు సామర్థ్యంలో గుండ్రేవుల జాశయం నిర్మాణానికి రాష్ట్ర విభజన తరువాత టీడీపీ ప్రభుత్వం రూ2,890 కోట్లు మంజూరు చేస్తే తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం అంతర్‌రాష్ట్ర సమస్య అంటూ పక్కన పడేసింది. జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు చొరవ తీసుకొని కూటమి ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు జరిపి పనులు మొదలయ్యేలు చర్యలు చేపట్టాలి.
- పత్తికొండ (పందికోన) జలశయం కుడి ఎమడ హంద్రీనీవా కాలువలు పూర్తి చేస్తే 65 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చు. అందుకు రూ.200 కోట్లు అవసరమవుతాయి. రాబోయే ఏడాదైనా పనులకు మోక్షం లభించేలా చూడాలి.
- ఆత్మకూరు నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న సిద్ధాపురం ఎత్తిపోతల పథకం కాలువలు పూర్తి చేసి పూర్తి ఆయకట్టుకు సాగునీరు ఇవాల్సిన అవసరం ఉంది.
- అసంపూర్తిగా ఉన్న అవుకు టన్నెల్ పూర్తి చేయాలి. అవుకు రిజర్వాయర్ గేట్లను మరమ్మతులు చేపట్టాలి
- కోసిగి మండలం పులికనుమ జలాశయం అదనంగా మరో ఒక టీఎంసీ సామర్థ్యం పెంపు పనులు చేపట్టాలి.

మన్మోహన్ సింగ్ సేవలు
మరువరానివి



- 2004 జూలై 1న సోమయాజులపల్లెకు రాక
- రైతు కుటుంబానికి ఆర్థిక సాయం
- చెరువు నిర్మాణానికి నిధులు మంజూరు
- అనుబంధాన్ని గుర్తు చేసుకుంటున్న గ్రామస్థులు



మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ నిధులు మంజూరు చేసిన చెరువు ఇదే

ఓర్వకల్లు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సేవలను సోమయాజులపల్లెవాసులు నేటికీ గుర్తు చేసుకుంటున్నారు. ఆయన సేవలు మరువలేనివని కొనియాడుతు న్నారు. సోమయాజులపల్లెకు చెందిన రైతు పెద్ద కురువ రంగన్న అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆయన భార్య పార్వతమ్మతోపాటు మిగతా రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం అందించేం దుకు 2004 జూలై 1న నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సోమయాజులపల్లెకు చేరుకున్నారు. బాధిత కుటుంబాలకు పరిహారం చెక్కులు అందజేశారు. గ్రామానికి సాగు నీరు లేదని మన్మోహన్ సింగ్ దృష్టికి రైతులు తీసుకెళ్లడంతో రూ.కోటి నిధులు మంజూరు చేశారు. సంవత్సరంలోపే చెరువు నిర్మాణం పూర్తి చేసి పొలాలకు సాగు నీరు అందించారు. ఆ చెరువు కింద దాదాపు 350 ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా బోర్లలో కూడా భూగర్భ జలాలు పెరిగాయి. ఇప్పటికీ ఆ గ్రామంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను స్మరించుకుంటున్నారు.



పరిహారం చెక్కును అందజేస్తూ..



నాటి ప్రధాని చేసిన సేవలు మరువరానివి

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి తీరని లోటు. మా గ్రామానికి ఆయన వచ్చి రైతులందరితో కలిసి చెరువు నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరడంతో తక్షణమే స్పందించారు. రూ.కోటి నిధులు మంజూరు చేసి చెరువు నిర్మాణం చేపట్టారు. ఆయన రుణం తీర్చుకోలేనిది. **- కాకి దేవేంద్ర, రైతు**



350 ఎకరాలకు సాగు నీరు

ప్రధాని మన్మోహన్ సింగ్ చొరవతో చెరువు నిర్మాణం చేపట్టడంతో 350 ఎకరాలకు సాగు నీరు అందుతోంది. అదేవిధంగా బోర్లలో కూడా భూగర్భ జలాలు పెరిగాయి. ఆయన మరణం తీరని లోటు.

- రామ మద్దిలేటి, రైతు

దేశం గొప్పనేతను కోల్పోయింది : ఎంపీ బస్తిపాటి

కర్నూలు అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి బాధాకరమని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు. దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందన్నారు. దేశ రాజకీయాల్లో మన్మోహన్ సరికొత్త శకాన్ని సృష్టించారన్నారు.

మన్మోహన్‌సింగ్ మృతి తీరని లోటు



మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్, కాంగ్రెస్ నాయకులు

నంద్యాల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, దేశ మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరనిలోటు అని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. మన్మోహన్‌సింగ్ మృతిపట్ల జిల్లా కాంగ్రెస్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం నంద్యాల కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్, కాంగ్రెస్ నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1991లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు కేబినెట్‌లో ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసిన మన్మోహన్‌సింగ్ దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి గ్లోబల్ ఎకానమీగా తీర్చిదిద్దారని కొనియాడారు. 2004నుంచి 2014వరకు భారత ప్రధానిగా సేవలు అందించిన మన్మోహన్‌సింగ్ దేశ ఆర్థిక వ్యవస్థను సుస్థిరం చేయడంలో, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడంలో కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు పఠాన్ హబీబ్‌ఖాన్, బాలస్వామి, రజాక్‌వలి, రమణ, జాకీర్‌హుసేన్, విశ్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు డీసీసీ ఆధ్వర్యంలో...



మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు అని కర్నూలు డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మన్మోహన్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పీజీ రాంపుల్లయ్య యాదవ్, సుధాకర్‌బాబు, సత్యనారాయణ గుప్త, దామోదరం రాధాకృష్ణ, వెంకట శివారెడ్డి, బ్రతుకన్న, అనంతరత్నం, షేక్‌ఖాద్రీ పాషా, లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

● క్లస్టర్ వర్సిటీలో...



నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు

డాక్టర్ మన్మోహన్ సింగ్ గొప్ప రాజకీయ అజాత శత్రువని ఉపకులపతి ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. క్లస్టర్ వర్సిటీలో మన్మోహన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ హేమంత్, డీన్ నాగరాజ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

కోట్ల కుటుంబంతో మన్మోహన్‌సింగ్ అనుబంధం

- పీవీ మంత్రివర్గంలో పని చేసిన మన్మోహన్, కోట్ల విజయభాస్కరరెడ్డి
- మన్మోహన్ మంత్రి వర్గంలో సూర్యప్రకాశ్‌రెడ్డి



మన్మోహన్ సింగ్‌తో విజయభాస్కర్ రెడ్డి(ఫైల్)

కర్నూలు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్‌సింగ్ (92)కు కర్నూలు జిల్లాతో అనుబంధం ఉంది. ఆ మహోన్నత వ్యక్తితో కర్నూలు జిల్లాకు చెందిన దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి కుటుంబానికి ఎనలేని అనుబంధం ఉంది. కాంగ్రెస్‌లో సీడబ్ల్యూసీ సభ్యులుగా కోట్ల విజయభాస్కరరెడ్డి, మన్మోహన్‌సింగ్ ఇద్దరు పని చేశారు. 1991లో భారత ప్రధానమంత్రిగా పీవీ నరసింహారావు బాధ్యతలు చేపట్టారు. పీవీ మంత్రివర్గంలో మన్మోహన్‌సింగ్ ఆర్థిక శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తే.. జిల్లాకు చెందిన పెద్దాయన కోట్ల విజయభాస్కరరెడ్డి న్యాయ, కంపెనీ వ్యవహారాలు బాధ్యతలు చేపట్టారు. ఇద్దరి మధ్య రాజకీయంగా సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. 1992లో కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసి కోట్ల విజయభాస్కరరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా రెండోసారి బాధ్యతలు చేపట్టారు. ఏపీ సీఎంగా కోట్ల వివిధ ప్రాజెక్టులకు నిధుల కోసం పలుమార్లు ఆనాటి ఆర్థిక శాఖ మంత్రి మన్మోహన్‌సింగ్‌ను కలిసి పలు రాజకీయ అంశాలే కాకుండా రాష్ట్ర అభివృద్ధి, కేంద్ర ప్రభుత్వం చేపట్టే ప్రాజెక్టులు, సంస్కరణలపై చర్చించేవారని అంటున్నారు. కోట్ల విజయభాస్కరరెడ్డి మరణాంతరం ఆయన రాజకీయ వారసుడిగా కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి కర్నూలు ఎంపీగా ఎన్నికయ్యారు. 2004, 2009లో జరిగిన రెండు పర్యాయాలు ఎంపీగా గెలిచారు. రెండో పర్యాయం ప్రధానిగా మన్మోహన్‌సింగ్ బాధ్యతలు చేపట్టిన తరువాత మంత్రివర్గ విస్తరణ సమయంలో కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డికి రైల్వే సహాయ మంత్రిగా అవకాశం కల్పించారు. తమ కుటుంబంతో మన్మోహన్‌సింగ్‌కు ఉన్న పరిచయం కారణంగా అనాటి ప్రధాని మన్మోహన్‌ను ఒప్పించి జిల్లాకు రైల్వే కోచ్ మరమ్మతుల పరిశ్రమను తీసుకొచ్చారు. ఈ రోజు భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మన మధ్య లేరని, తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని తెలిసి కోట్ల అనుచరులు, ముఖ్యంగా కాంగ్రెస్ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు.

వ్యక్తి ఆత్మహత్య

ఎమ్మిగనూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని సున్నంబట్టి ప్రాంతంలో బెస్త సీతారామరాజు(26) ఉరివేసు కొని ఆత్మహత్య చేసుకున్నాడు. సీతారామరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే భార్య వివాహేతర సంబంధంతో ఇంటి నుంచి వెళ్లిపో యింది. దీంతో మనస్తాపానికి గురైన సీతారామ రాజు శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలమూరులో చోరీ

- 5 తులాల బంగారు, రూ.50 వేలు అపహరణ

పాణ్యం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చొరబడి 5 తులాల బంగారు, రూ.50 వేలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు వెంకటసుబ్బయ్య తెలిపారు. ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చేలోపు ఇంట్లో దొంగతనం జరిగిందని పాణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ సంఘటనపై నంద్యాల క్లూస్ టీం వేలిముద్రలు సేకరించిందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

ముగ్గురికి జైలు శిక్ష

నంద్యాల క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ముగ్గురు వ్యక్తులకు 30 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ జ్యుడీషియరీ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి ఉత్తర్వులు జారీ చేసినట్లు నంద్యాల తాలుకా పోలీసులు తెలిపారు.

నంద్యాల పట్టణంలోని బైటిపేటకు చెందిన వడ్ల రాజశేఖర్, దళితవాడకు చెందిన పెద్దమాతంగి లక్ష్మయ్య, బేతంచెర్ల మండలం ఆర్‌ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన చాకలి మధురాజు అనే ముగ్గురు వ్యక్తులు గురువారం నంద్యాల మండలంలోని నందమూరినగర్ వద్ద రోడ్డుపై వెళ్తున్న మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు నంద్యాల తాలుకా పోలీసులు తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి వారికి జైలు శిక్ష విధించడంతో సబ్‌జైల్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలి

- వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- వైసీపీ ఆధ్వర్యంలో కాటసాని గృహం నుంచి ర్యాలీ



విద్యుత్ ఎస్ఈకి వినతిపత్రం అందిస్తున్న కాటసాని

కల్లూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకో వాలని పాణ్యం మాజీ ఎమ్మెల్యే, నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. వైసీపీ అధిష్టానం ఆదేశాల మేరకు శుక్రవారం కాటసాని స్వగృహం నుంచి వైసీపీ శ్రేణులు బళ్లారి చౌరస్తా మీదుగా కర్నూలు జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఎన్నికల ప్రచారంలో విద్యుత్ చార్జీలు పెంచము వీలైతే తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ప్రజల నడ్డి విరిచేలా కరెంట్ చార్జీలు పెంచడం సరైందికాదన్నారు. అనంతరం విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎం. ఉమాపతికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ మేయర్ ఎస్.రేణుక, కార్పొరేటర్లు గాజుల శ్వేతారెడ్డి, వైజా అరుణ, దండు లక్ష్మీకాంతరెడ్డి, చిట్టెమ్మ, ఇప్పల నారాయణరెడ్డి, బెల్ల మహేశ్వరరెడ్డి, కల్లూరు, ఓర్వకల్లు, పాణ్యం, గడివేముల మండలాల వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈవీఎంల గోదాము తనిఖీ



గోదాముకు వేస్తున్న సీల్‌ను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నంద్యాల టెక్క మార్కెట్‌యార్డులోని ఈవీఎం గోదామును కలెక్టర్ రాజకుమారి పర్యవేక్షించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గోదాములకు వేసిన సీల్‌ను ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబం దించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనం తరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో కలెక్టర్ సంత కం చేశారు. ఈవీఎంల గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. డీఆర్వో రామునాయక్, ఆర్డీవో విశ్వనాథ్, ఎన్నికల విభాగపు తహసీల్దార్ జయప్రసాద్, రాజకీయ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు పాపం వైసీపీదే

- టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్



పసుపునీళ్లతో శుద్ధి చేస్తున్న టీడీపీ నాయకులు

కల్లూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపు పాపం గత వైసీపీ ప్రభుత్వానిదేనని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచిందని వైసీపీ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈమేరకు కర్నూలు మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్‌తో కలిసి ఆయన వైసీపీ నాయకులు ర్యాలీ చేసిన ప్రాంతాన్ని శుక్రవారం పసుపునీటితో శుద్ధి చేశారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ కన్వీనర్ డి.రామాంజనేయులు, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, ఎస్.పిరోజ్, టీడీపీ జిల్లా కోశాధికారి పీయూ.మాధన్న, ఎన్వీ.రామకృష్ణ, సంపతి లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 354 అర్జీల స్వీకరణ

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం 24 గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 354 అర్జీలు స్వీకరించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ తెలిపారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని గోనెగండ్ల మండలం వేముగోడు 15, నందవరం మండలం గురుజాల గ్రామంలో 3, ఎమ్మిగనూరు మండలం మల్కాపురంలో 5, కోసిగిత మండలం ఆర్లబండలో 20, కౌతాళం మండలం బాపురంలో 11, మంత్రాలయం మండలం కల్లుదేవకుంటలో 4, పెద్దకడుబూరు మండలం మేకడోనలో 2, ఆదోని మండలం సాంబగల్లులో 7, నెట్టేకల్లులో 3, హోలగుంద మండలం నగర కన్వి గ్రామంలో 9, కోసిగి మండలం పుట్ట కుంట గ్రామంలో 0, కౌతాళం మండలం ఖాత్రికిలో 6, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని కర్నూలు అర్బన్‌లోని రోజావీధిలో 6, ఓర్వకల్లు మండలం శకునాలలో 8, కల్లూరు మండలం బొల్లవరంలో 39, వెల్దుర్తి మండలం చెరుకులపాడులో 11, కర్నూలు రూరల్‌లోని నిడ్జూరు గ్రామంలో 12, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని పత్తికొండ మండలం పెద్దహుల్తిలో 6, తుగ్గలి మండలం రాతనలో 9, క్రిష్ణగిరి మండలం పోతుగల్ గ్రామంలో 125, మద్దికెర మండలం బురుజులలో 38, ఆలూరు మండలంలోని ముసనహల్లి గ్రామంలో 6, చిప్పగిరి మండలంలోని నన్నిచెర్లలో 4, ఆస్పరి మండలం బినిగేరిలో 5, మొత్తం 354 అర్జీలను స్వీకరించామని డీఆర్వో తెలిపారు.

గతంలో పెంచిన విద్యుత్ చార్జీలే శాపాలు

- వైసీపీ ఆందోళనలపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ధ్వజం



కర్నూలు అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జగన్ ఐదేళ్ల పాలనలో పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచి నేడు ఆందోళనలు చేయడం సిగ్గుచేటని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డారు. జగన్‌రెడ్డి చేసిన పిచ్చి పాలనలో రాష్ట్ర ప్రజలు విసిగి వేసారి పోయారని, ఫలితంగానే ప్రతి పక్ష హోదా కూడా ఇవ్వలేదన్నారు. రైతు సమస్యలంటూ గత 13న ఒక నాటకం ఆడితే దాన్ని ప్రజలు పట్టించుకోలేదన్నారు. నేడు విద్యుత్ చార్జీల పేరుతో మరో నాటకానికి తెరలేపాడని మండి పడ్డారు. జగన్ పరదాల చాటున పాలన సాగించి, ప్రజల గురించి ఏనాడు పట్టించుకో లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని ఏడారిలా మార్చేసి. కోట్లాది ప్రజాధనాన్ని దోచేసు కోవడం తోను, కక్షపూరిత రాజకీ యాలతో అక్రమ కేసులు, హ త్యాచా రాలు, ఇసుక, మద్యం, గంజాయి, మైనింగ్ దందా, భూ దందాలతో మాఫియాలతో పాలక సాగించి ప్రజల ఆస్తులను సైతం దోచుకున్నారడన్నారు. విద్యుత్ ఉత్పత్తికి మారు పేరైన ఏపీ జెన్‌కో జగన్మోహన్‌రెడ్డి నాశనం చేశాడన్నారు. ప్రజలకు విద్యుత్ అవసరాలు అనే పేరుతో జగన్‌రెడ్డి తన అస్మదీయుల నుంచి అధిక రేట్లకు విద్యుత్ కొనుగోలు చేయించి విద్యుత్ రంగాన్ని నాశనం చేశాడన్నారు. కేవలం ఉనికి కోసమే ఇలాంటి చౌక బారు కార్యక్రమాలు చేపడుతున్నారని, ఇకనైనా వాటికి స్వస్తి పలికి నిజాలు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ చార్జీల పెంపు భారం జగన్‌రెడ్డిదే

విద్యుత్ చార్జీల పెంపు పాపం వైఎస్ జగన్మోహన్ రెడ్డి దేనని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్ అన్నారు. శుక్ర వారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో సీఎంగా ఉన్న సమ యాన ఆనాలోచిత విధానాలతో పెంచిన విద్యుత్ చార్జీలపైన వైసీపీ ఆందోళనలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. పెంచిన చార్జీలను జగన్ రెండేళ్ల క్రితం వేయాల్సిందని తన ప్రభు త్వానికి చెడ్డపేరు వస్తుందని, తాను ఓటమి అంచుల్లో ఉన్నానని గ్రహించి వాయిదా వేశారని గుర్తు చేశారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర, ఎస్ షేక్షావలి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో సీపీఎం జిల్లా మహాసభలు

- 29,30 తేదీల్లో నిర్వహణకు ఏర్పాట్లు
- 29న బహిరంగ సభ : సీపీఎం నాయకులు



మాట్లాడుతున్న నాయకులు రామాంజనేయులు, గోవిందు

ఎమ్మిగనూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మొదటి సారిగా సీపీఎం కర్నూలు జిల్లా 23వ మహాసభలు నిర్వహించనున్నట్లు సీపీఎం నాయకులు తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు రామాం జనేయులు, పీఎస్ రాధాకృష్ణ, స్థానిక నాయకలు గోవిం దులు మహాసభల వివరాలను వెల్లడించారు. ఈనెల 29, 30 తేదీల్లో కర్నూలు జిల్లా 23వ మహాసభలు నిర్వహిస్తు న్నామన్నారు. ఇందులో భాగంగా 29న పట్టణంలోని కొత్త మున్సిపల్ కార్యాలయం నుంచి శ్రీనివాస సర్కిల్, ట్యాంకు బండ్ రోడ్డు, సంతమార్కెట్, సోమప్ప సర్కిల్ మీదుగా బహిరంగ సభ ప్రాంతమైన పాత తహసీల్దారు కార్యాలయం ఆవరణ వరకు ర్యాలీ ఉంటుందన్నారు. ముఖ్య అతిథులుగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గీయులు ప్రభాకర్ రెడ్డి, వీ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, కర్నూలు జిల్లా కమిటీ సభ్యులు హనుమంతులు హాజరవుతున్నారని తెలిపారు. 30న ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. మహాసభల్లో జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైనా, పెండింగ్ ప్రాజెక్టులపైన, జిల్లాకు ఇచ్చిన హామీల అమలుపైన, చేనేతల ఉపాధి అవకాశాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మొదటి సారి ఎమ్మిగనూరు పట్టణంలో జరుగుతున్న సీపీఎం జిల్లా మహాసభలకు ప్రజలు, మేధావులు, కార్మికులు, కర్షలుకు, విద్యార్థులు, యువతీయువకులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, స్థానిక నాయకులు రాముడు, హనుమంతు, సురేష్ పాల్గొన్నారు.

ప్రైవేటుకు అప్పగించొద్దు: సీఐటీయూ


ఆర్‌టీవోకు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు క్రైం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వాహనాల ఫిట్నెస్, డ్రైవింగ్ టెస్టు సర్టిఫికెట్ల జారీని ప్రైవేటు సంస్థలకు అప్పగించే ఆలోచనను విరమించుకోవాలని సీఐటీయూ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్‌టీఏ కార్యాలయంలో సీఐటీయూ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు బి.రాధాకృష్ణ, కే.రవి కార్యదర్శి ఎస్.హుశేన్‌వలిలు ఆర్టీవో భరత్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీఏ కార్యాలయంలో రోజులకొద్ది జరుగుతున్న ఈకేవైసీ మండల మ్యాపింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించి వాహన దారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రయాణరంగాన్ని నిర్వీర్యం చేయడానికి ఆర్‌టీఏ కార్యాలయాల్లో ప్రైవేటు పరం చేసి ప్రైవేటు వ్యక్తులకు గంపగుత్తగా ఆర్‌టీయే కార్యాలను అప్పజె ప్పడం పనిగా పెట్టుకుందని ఈ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్టీవో భరత్ చౌహాన్ మాట్లాడుతూ మీ డిమాండ్లను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నగర నాయకులు ఎస్.మాలిక్‌బాషా, నబీ పాల్గొన్నారు.

పచ్చదనంతో పలకరింపు

- నూతన సంవత్సరానికి మొక్కలతో స్వాగతం పలుకుదాం
- జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్


కలెక్టరేట్ ఎదుట పూల మొక్కలతో స్వాగతం పలుకుతున్న జేవీవీ కార్యకర్తలు

కర్నూలు ఎడ్యుకేషన్/హాస్పిటల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని మొక్కలతో స్వాగతం పలుకుదామని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట పూలమొక్కలతో స్వాగతం పలుకుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలపడానికి చాలా మంది ఖరీదైన బొకేలు, రకరకాల గ్రీటింగ్ కార్డులు, స్వీట్లు పంచుతుంటారని, అంత ఖరీదుతో ఇచ్చే కానుకలు ఎంత కాలం ఉంటాయో చెప్పలేమని, అదే మొక్కలు అందజేసి పచ్చదనంతో పలకరింపు ఇద్దామని తెలిపారు. గ్రీట్ విత్ గ్రీన్ సొసైటీ అధ్యక్షుడు బి.శ్రీరాములు మాట్లాడుతూ సకల జీవజాతుల ఆరోగ్యకర జీవనానికి మొక్కలు ఉపయోగపడుతాని తెలిపారు. కార్యక్రమంలో రామాంజనేయులు, శేషగిరి, కృష్ణంరాజు, వీరేష్, వివేక్, సయ్యద్ బాషా, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోండి


సీఈవో మురళీధర్‌చౌదరి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్క ఖాతాదారుడు ఈకేవైసీ చేయించుకోవాలని పసుపుల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సీఈవో కె.మురళీధర్‌చౌదరి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పసుపుల, సూదిరెడ్డిపల్లి, నూతన పల్లె, పి.రుద్రవరం, బి.తాండ్రపాడు, వెంకాయ పల్లె, మిలిటరి కాలనీ, నందనపల్లె, పడిదెంపాడు, పూడూరు, మునిసిపల్ పరిధిలోని జోహరపురం వ్యవసాయ పరపతి సంఘం ఖాతాదారులు ఈ నెల 31వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈకేవైసీతో ప్రభుత్వ పథకాల లబ్ధితోపాటు మరెన్నో ప్రయోజనాలు ఉన్నాయని, దీనిని ఖాతాదారులు నిర్లక్ష్యం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఈకేవైసీకి సహకరించాలి

కర్నూలు కల్చరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఖాతాదారులు సంబంధిత సచివాలయాల సిబ్బంది చేపట్టిన ఈకేవైసీకి సహకరించాలని కర్నూలు మండలం గార్గేయపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పర్సన్ ఇన్‌చార్జి పి. లక్ష్మీకాంతరెడ్డి, సంఘం సీఈఓ పి. కోటేశ్వరరెడ్డి, కర్నూలు మండలం, ఉల్చాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పర్సన్ ఇన్‌చార్జి సి.విజయబా రతి, సీఈఓ వై. హరినాథరెడ్డి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈకేవైసీ చేయించుకోవడం వల్ల ప్రభుత్వాలు అందించే రాయితీలు రైతులు పొంద వచ్చని వారు తెలిపారు. సహకార వ్యవస్థ బలోపేతానికి, ప్రభుత్వ రాయి తీలు పొందేందుకు రైతులంతా ఈకేవైసీ చేయించుకోవాలని వారు సూచించారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

కర్నూలు అర్బన్, డిసెంబర్ 27(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో విద్యార్థుల సౌకర్యార్థం పాలక మండలి సభ్యులు నవీద్ పర్వేజ్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను వితరణ చేశారని ఉపకులపతి పీఎస్ షావాలి ఖాన్ తెలిపారు. శుక్రవారం వర్సిటీలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థుల కోసం శుద్ధమైన సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయించడం అభినందనీయమన్నారు.

గూడూరు-పెంచికలపాడు రహదారికి మోక్షం

గూడూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గూడూరు - పెంచికలపాడు రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. రెండు నెలల క్రితం గూడూరు - పెంచికలపాడు రహదారి గుంతలమయంగా ఉండేది. గూడూరు నుంచి పెంచికలపాడు మీదుగా కర్నూలుకు వెళ్ళే వాహనదారులు ఇబ్బందులకు గురయ్యేవారు. వర్షం కురిసిందంటే చాలు రోడ్డుపై గుంతల్లో వర్షం నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడేవారు. అలాగే పెంచికలపాడు సమీపంలో బ్రిడ్జి దగ్గర రోడ్డు గుంతలమయంగా మారి రోడ్డుకు వేసిన ఇనుప కడ్డీలు బయట రావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందేవారు. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం సంక్రాంతి నాటికి పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో గుంతలను పూడ్చేందుకు నిర్ణయం తీసుకోవడంతో గుంతలమయంగా మారిన రోడ్లకు మోక్షం లభించింది. అందులో భాగంగా గూడూరు- పెంచికలపాడు రోడ్డుకు ప్యాచ్ వర్క్ చేపట్టారు. పెంచికలపాడు బ్రిడ్జిపై రోడ్డుకు ప్యాచ్ వర్క్ చేపట్టి రోడ్డును వేశారు. ఇన్ని రోజులుగా ఇబ్బందులు పడ్డ వాహనదారులు గుంతలను పూడ్చి రోడ్డు వేయడంతో సీఎం చంద్ర బాబుకు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.


టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు గుంతలకు వేసిన ప్యాచ్


వైసీపీ ప్రభుత్వ హయాంలో పెంచికలపాడు సమీపంలో గుంతలు పడిన రహదారి (ఫైల్)

హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి


నిరసన తెలుపుతున్న హెల్త్ అసిస్టెంట్లు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు పద్ధతిలో 22 ఏళ్లుగా పని చేస్తున్న తమను ఇటీవల తొలగించారని, ప్రభుత్వం తిరిగి విధుల్లో తీసుకోవాలని హెల్త్ అసిస్టెంట్లు కోరారు. శుక్రవారం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు వారు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్లు ఆర్‌బీ ప్రభాకర్, రామకృష్ణ, ఎండీ హుశేన్, జయరాముడు, రంగన్న, నాగరాజు, కరుణాకర్, సురేష్ మాట్లాడుతూ తమను విధుల నుంచి తొలగించడంతో భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు అప్పీలుకు వెళ్లామన్నారు. హెల్త్ అసిస్టెంట్లును తెలంగాణలో కొనసాగిస్తున్నారని, ఏపీలో తొలగించడం అన్యాయమన్నారు. సీఎం చంద్రబాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడి తమను విధుల్లో తీసుకునేలా చూడాలని వారు కోరారు.

పుట్టగొడుగులతో బహుళ ప్రయోజనాలు


పుట్టగొడుగుల పరిశ్రమను పరిశీలించడానికి వచ్చిన వీపీ శర్మ

ఓర్వకల్లు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పుట్టగొడుగులతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని హిమాచల్‌ప్రదేశ్ డీఎంఆర్వో వీపీ శర్మ అన్నారు. శుక్రవారం మండలంలోని కాల్వ గ్రామ సమీపంలో ఉన్న పుట్టగొడుగుల పరిశ్రమను ఆయన పరిశీలించారు. ఈ పరిశ్రమలో ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం ఆనందదాయకమన్నారు. పుట్టగొడుగులలో ఉన్న విశిష్ట పోషక విలువలు ఆరోగ్యానికి మేలు చేసే గుణాల వల్ల వీటికి మంచి గిరాకీ ఉందన్నారు. ప్రస్తుతం ఎక్కువ మంది పుట్టగొడుగులను తీసుకుంటున్నారన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చన్నారు. పుట్టగొడుగుల్లో ప్రోటీన్లు, విటమిన్లు సమృద్ధి ఉంటాయన్నారు. పుట్టగొడుగులను వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారన్నారు. ఈ పరిశ్రమలో తీసిన వేస్టయిన ఎరువులను కూడా రైతులకు పంట పొలాలకు ఉచితంగా ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో సీనియర్ సైంటిస్టు శ్వేతకమాల్, డా.ఎండీ వీకేవీ ప్రసాద్, డైరెక్టర్ వికాస్, జనరల్ మేనేజర్ చండిల్ సింగ్ పాల్గొన్నారు.

'ఓబన్న జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలి'

కర్నూలు అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమరయోధుడు వడ్డెర ఓబన్న జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం విజయవాడలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవితను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు వడ్డెర ఓబన్న బ్రిటిష్ వారిపై ఎదురుండి పోరాడిన వీరుడుగా చరిత్రకు ఎక్కారన్నారు. రాష్ట్ర రాజధానిలో 100 అడుగుల వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఓర్సు వీర భాస్కర్, దేవేళ్ల మురళి, వల్లెపు బాల అంకమ్మ రావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా బి.క్యాంపు సెక్షన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డివిజన్ ఈఈ టి.శేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం బి.క్యాంపుసెక్షన్ పరిధిలోని పలు కాలనీల్లో ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు కరెంట్ ఉండద న్నారు. శ్రీలక్ష్మీనగర్, అరోరానగర్, టెలికాంనగర్, కమలానగర్, డాక్టర్స్ కాలనీ, గఫూర్‌నగర్, సోమప్పకాలనీ, పోస్టాఫీసు సర్కిల్, మహాలక్ష్మీనగర్, ఎస్పీ బంగ్లా, అమ్మా హాస్పిటల్ ప్రాంతాల్లో కరెంట్ కోత ఉంటుందని ప్రజలు గమనించాలని కోరారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

గూడూరు, డిసెంబరు 27: ఎమ్మిగనూరులో ఈ నెల 29, 30 తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ప్రాంతీయ కార్యదర్శి జె మోహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం గూడూరులో సీపీఎం ప్రాంతీయ కమిటీ సభ్యుడు రాజశేఖర్ అధ్యక్షతన సీపీఎం జిల్లా మహాసభల పోస్టర్లను జె మోహన్ విడుదల చేసారు. ఈ సందర్భంగా జె మోహన్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి రైతాంగానికి, ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించాలన్నారు. ప్రభు త్వాలు తాగునీటి ప్రాజెక్టులు నిర్మించి కర్నూలు జిల్లాను అన్ని రకాలుగా అభివృద్ధి చేసే దిశగా ఆలోచించకుండా కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దానమన్న, మునెప్ప, కొమ్మురాజు, చిన్నరాజు పాల్గొన్నారు.

రబీ పంటలపై శిక్షణ

గూడూరు, డిసెంబరు 27: స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో రబీ పంటలపై గూడూరు, సి.బెళగల్ మండలాల రైతు సేవా కేంద్రాల సిబ్బందికి వ్యవసాయ అధికారులు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ (ఆర్)సాలు రెడ్డి, డీఆర్‌సీ-ఏడీఏ గిరిశ్ కుమార్, గూడూరు, సి.బెళగల్ మండలాల వ్యవసాయ అధికారులు శ్రీవర్ధన్ రెడ్డి, మల్లేష్ కుమార్ హాజరయ్యారు. డీఆర్‌సీ ఏడీఏ గిరిశ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం సాగు చేస్తున్న శనగ, మినుము, మొక్క జొన్నలో కత్తెర పురుగు నివారణ మొదలైన వాటి గురించి ఆర్‌ఎస్‌కే సిబ్బందికి అవగాహన కల్పించారు.

పప్పుశగన పంట పరిశీలన

సి.బెళగల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలకల్లు, ముడుమాల, ఇనగండ్ల గ్రామాలలో రైతులు సాగు చేసిన పప్పుశనగ పంటను శుక్రవారం కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, శాస్త్రవేత్త గిరిజ పరిశీలించారు. శాస్త్రవేత్త గిరిజ మాట్లాడుతూ పప్పుశనగకు తెల్లమచ్చ తెగుళ్ల సోకి పంట ఎండు ముఖం పడుతుందని, దీని నివారణకు 19 19 19, కాంటాఫ్‌ను కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఏవో మల్లేష్‌కుమార్, ఎంపీఈవోలు ఉన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాస వేడుకలు


స్వామి అమ్మవార్లకు నైవేద్యం సమర్పిస్తున్న అర్చకులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాస వేడుకలు కొనసాగుతున్నాయి. బళ్లారి చౌరస్తా, వై.జంక్షన్ సమీపంలోని వాసవీనగర్‌లోని వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ధనుర్మాసం 12వ రోజు స్వామి వారికి క్షీరాభిషేకం, అమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహించారు. గోదాదేవి అమ్మవారు స్వయంగా రచించిన తిరుప్పావై పాశురాలు పఠించారు. సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో యాలిశెట్టి భద్ర య్య శెట్టి కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

● గోదా గోకుల క్షేత్రంలో.. నగర శివారు మామిదాలపాడులోని గోదా రంగనాథ స్వామి వారి దేవస్థానం (గోదా గోకులం)లో శుక్రవారం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు చేపట్టారు. ఉదయం వేకువ జామున 4.30 గంటలకు నిత్య ఆరాధన, శ్రీదేవీ, భూదేవీ సమేత రంగనాథ స్వామివారి భోగమూర్తులకు, శ్రీగోదా కృష్ణులకు, సాలగ్రామాలకు అభిషేకం నిర్వహిం చారు. అర్చకులు పంచసూక్త పారాయణం చేసి, మహా మంటపంలో విష్ణు సహస్రనామాలు, గోవింద నామాలు పారాయణం చేశారు. అనం తరం స్వామి, అమ్మవార్లకు అలంకరణ సేవ, తోమాల సేవ చేసి తిరుప్పావై పఠించారు. అనంతర రంగనాథ, గోదాదేవి శతనామార్చన, నివేదన చేసి, మాడవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం తీర్థప్రసాదాలు, ప్రవచన బోధన, రాత్రి పవళింపు సేవ నిర్వహించారు. కాగా క్షేత్రంలో కొనసాగుతున్న అఖండ విష్ణు సహస్రనామ సప్తాహంలో ఆసక్తిగల భక్తులు తమ పేరు ఆలయంలో నమోదు చేసుకోవాలని గోకు లం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు తెలిపారు. శనివారం ఉదయం 7 గంటలకు పుష్పయాగం ఉంటుందని వారు పేర్కొన్నారు.

నేడు 20 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం 20 గ్రామాల్లో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని గోనెగండ్ల మండలం తిప్పనూరు గ్రామం, నందవరం మండలం మిట్టసోమాపురం, ఎమ్మిగనూరు మండలంలోని పార్లపల్లి, కోసిగి మండలం మూగలదొడ్డి, కౌతాళం మండలం దేవలదిన్నె, వీర్లదిన్నె, మంత్రాలయం మండలం చిలకలడోన, పెద్దకడుబూరు మండలం కల్లుకుంట, ఆదోని మండలం బైచగేరి, ఎస్.కొండాపురం, హోళగుంద మండలం హోన్నూరు, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె గ్రామం, కల్లూరు మండలంలోని సులూరు గ్రామం, వెల్దుర్తి మండలం ఎస్.పెరుముల గ్రామం, కర్నూలు రూరల్‌లోని బసాపురం, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని పత్తికొండ మండలం చిన్నహుల్తి, తుగ్గలి మండలం ఈదులదొడ్డి, క్రిష్ణగిరి మండలం ఆగవల్లి, ఆలూరు మండలం ఖాత్రికి, ఆస్పరి మండలం చిగిలి గ్రామం మొత్తం 20 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగనున్నాయి

సీసీ కెమెరాలతో చీరలు రికవరీ

కర్నూలు క్రైం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల ఆధారంతో పోలీసులు చీరలను రికవరీ చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీకి చెందిన ఫోరెన్సిక్ ప్రొఫెసర్ నాగార్జున ఈ నెల 26న శ్రీనివాస క్లాత్ మార్కెట్‌లో చీరల షాపింగ్ చేశారు. ఆ తర్వాత ఆటో ఎక్కి అనంతరం ఆటోలో బ్యాగును మరిచిపోయారు. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ రామయ్యనాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ బాషా, కానిస్టేబుల్ షేక్షావలిలో సీసీ కెమెరాల ద్వారా ఆటో నెంబరును గుర్తించారు. ఆటో ఆచూకీని కనుకుని ఆ చీరల బ్యాగును తిరిగి బాధితులకు అప్పగించారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

కర్నూలు కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో రామచంద్రనగర్‌లోని శివ రామాలయం వద్ద రాణి ఝాన్సీలక్ష్మీబాయి ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత కుట్టు శిక్షణలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలన్న లక్ష్యంతో వీహెచ్‌పీ ప్రయత్నిస్తోందని, అందులో భాగంగానే ఈ కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభించామని తెలిపారు. రెవెన్యూ కాలనీలోని వీహెచ్‌పీ కార్యాలయంలో, షరీన్‌నగర్‌లోని సద్గురు త్యాగరాజ రామాలయంలో, బుధవారపేటలోని శివాలయంలో ఈ శిక్షణ కేంద్రాలు అందు బాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర సహ కార్యదర్శి పి. కోటేశ్వర రావు, జిల్లా కార్యదర్శి భానుప్రకాశ్, సహ కార్యదర్శి ఈపూరి నాగరాజు పాల్గొన్నారు.

రెండో రోజూ క్రీడా పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్‌ను పురస్కరించుకుని నిర్వహిస్తున్న క్రీడా పోటీలు శుక్రవారం రెండో రోజు కొనసాగాయి. స్థానిక డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో షటిల్, స్పీడ్ మెంటన్, బాక్సింగ్ పోటీలను చర్చి సభ్యులు ఆధ్వర్యంలో జరిగింది. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా మాజీ ఫుట్‌బాల్ క్రీడాకారుడు, విశ్రాంత ప్రత్యేక కలెక్టర్ అన్నెపోగు మద్దిలేటి హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని షటిల్, బాక్సింగ్ క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో క్రీడల కన్వీనర్ పాల్ సుధాకర్, విజయకుమార్, సభ్యులు ముత్యాల భాస్కర్, ప్రసన్న దత్, రూపస్, రోనాల్డ్, డేవిడ్, న్యాయ నిర్ణేతలు విన్సెంట్ గాంధీ, అబ్రహాం ప్రభు, దినకర్, జయకుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.

5 నుంచి జాతీయ స్థాయి సీనియర్ మహిళా హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జనవరి 5 నుంచి 9వ తేదీ వరకు బీహార్ రాష్ట్రంలోని పునర్నిలో 53వ జాతీయ స్థాయి సీనియర్ మహిళా హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నట్లు ఏపీ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఈ నెల 22, 23 తేదీల్లో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ఏపీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో కరెంటు చార్జీల బాదుడు

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి
- కర్నూలులో భారీ ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీలను భారీగా పెంచి ప్రజలపై పెనుభారాన్ని మోపుతోందని మాజీ ఎమ్మెల్యే వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పెంచిన కరెంటు చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వైసీపీ శ్రేణులు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. ముందుగా ఎస్టీబీసీ కళాశాల మైదానంలో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్టీబీసీ కళాశాల నుంచి కేవీఆర్ కళాశాల ఎదురుగా ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రతి కార్యక్రమంలో కరెంటు చార్జీలు పెంచబోమని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన వెంటనే అవన్నీ మరచిపోయి కరెంటు చార్జీలు పెంచడం దారుణమన్నారు. ప్రజలపై సుమారు రూ.15 వేల కోట్ల భారం వేయడం సరికాదన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన వెంటనే రూ.75 వేల కోట్లు అప్పుచేశారని అన్నారు. దాదాపు అన్ని సంక్షేమ పథకాలకు మంగళం పాడారని విమర్శించారు. త్వరలోనే ప్రజా వ్యతిరేకతను కూటమి ప్రభుత్వం రుచిచూస్తుందని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ శాఖ డీఈకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ బీవై.రామయ్య, నాయకులు అహ్మద్ అలీఖాన్, తెర్నేకల్ సురేందర్ రెడ్డి, సుభాస్ చంద్రబోస్, కార్పొరేటరు సత్యనారాయణమ్మ, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

12 మంది కార్పొరేటర్లు డుమ్మా..!

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ కర్నూలు నియోజకవర్గానికి సంబంధించిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అయితే కర్నూలు అసెంబ్లీకి సంబంధించిన 12 మంది వైసీపీ కార్పొరేటర్లు ఈ కార్యక్రమానికి డుమ్మా కొట్టారు. గతం నుంచే ఎస్వీ మోహన్‌రెడ్డి వర్గానికి, మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ వర్గానికి ఆధిపత్యపోరు సాగుతోంది. ఇటీవలి కాలంలో కూడా చాలా సందర్భాల్లో బయటపడ్డాయి. అయితే ప్రత్యేకంగా నిర్వహించిన ర్యాలీకి కార్పొరేటర్లు హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

విద్యుత్ చార్జీలను తగ్గించాలి: వైసీపీ

కోడుమూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పెం చిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని వైసీపీకి చెందిన జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి అన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ శుక్రవారం స్థానిక కోట్ల సర్కిల్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన 6 నెలలకే విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలను మోసగించారని అన్నారు. అనంతరం ట్రాన్స్‌కో ఏఈ మధుసూధన్‌కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఆదిమూలపు సతీష్, గూడూరు ఎంపీపీ సునిత, కోడుమూరు నాయకులు క్రిష్టారెడ్డి, రమేష్‌నాయుడు, రవికుమార్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, లింగన్న, తేనేశ్వరరెడ్డి, లింగమూర్తి పాల్గొన్నారు.


ట్రాన్స్‌కో ఏఈకి వినతి పత్రం ఇస్తున్న వైసీపీ నాయకులు

కడప మహిళకు అరుదైన ఆపరేషన్

అండ్రినల్ గంధిలో క్యాన్సర్ కణితి తొలగింపు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఇందిరాగాంధీ నగర్‌కు చెందిన 49 ఏళ్ల రమణమ్మకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల యురాలజీ వైద్యులు ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహిం చారు. రమణమ్మ ఓ ఆశ్రమం నిర్వహిస్తోంది. గత 6 నెలల నుంచి తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతూ కడపలోని వైద్యులకు చూపించుకుంది. రెఫరల్ కేసుగా ఈ నెల 10వ తేదీ యురాలజీ విభాగానికి రాగా, యురాలజీ హెచ్‌వోడీ డాక్టర్ కే.సీతారామయ్య రోగికి పరీక్షలు నిర్వహించగా.. కిడ్నీ దగ్గర, లివర్‌కు దగ్గరలో రక్త నాళాలకు ఆనుకుని 8 సెం.మీల గడ్డ ఉన్నట్లు గుర్తించారు. దీంతో పాటు రోగి ఊబకాయం హైపటైటిస్(బీ)తో బాధపడుతుంది. కడప వైద్యులు కర్నూలు జీజీహెచ్‌కు రెఫర్ చేయగా.. కర్నూలు జీజీహెచ్ యురాలజీ వైద్యులు ఈ కేసును చాలెంజ్‌గా తీసుకున్నారు. ఈనెల 13న యురాలజీ హెచ్‌వోడీ డాక్టర్ కే.సీతారామయ్య అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ముత్యశ్రీ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు బాలరవితేజ, రాజశేఖర్, మహేష్ నాయక్ మత్తు మందు వైద్యులు మురళి ప్రభాకర్, స్వాతి, పీజీలు హిమజా, ఫాతిమా, ప్రశాంత్ వైద్య బృందం 3 గంటలు శ్రమించి 8 సెంటీమీటర్లు కణితిని తొలగించారు. కడపలో కాదన్న కేసును కర్నూలు జీజీహెచ్ యురాలజీ వైద్యులు విజయవంతంగా నిర్వహించడంపై రోగి బంధువులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కర్నూలు జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ కే.సీతారామయ్య మాట్లాడుతూ ఆపరేషన్ సమయంలో కణితికి ఇరువైపులా కాలేయం, ఐవీసీ పెద్ద రక్తనాళం అత్తుకుని ఉన్నా ఎంతో కష్టంతో కణితిని తొలగించామన్నారు. బీపీ, ఊబకాయం, కడుపు నొప్పి, హైపటైటిస్-బీతో బాధపడుతున్న రోగికి ఆపరేషన్ చేసి శుక్రవారం డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి

నందవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకులు బండేగురుస్వామి, పూలచింత సర్పంచ్ అక్కామాంబదేవి అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి గ్రామానికి ప్రత్యేక నిధులు కేటాయించారని అన్నారు. పూలచింతకు రూ. 10లక్షల సీసీ రోడ్డు పనులు చేస్తున్నామని తెలిపారు. కుమ్మరి వీధి, బీసీ, ఎసీ కాలనీల్లో పైపులైన్లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య తీర్చామని, మఠం ముందు త్వరలో రూ 3.లక్షలతో సీసీ రోడ్డు వేస్తామన్నారు. సభ్యత నమోదు కూడా 260 చేశామని, వాటిని 500 వరకు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి


పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

కౌతాళం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో 29,30వ తేదీలలో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ ఈరన్న పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జిల్లా మహసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరును ఎండకట్టేందుకు ఎమ్మిగనూరులో మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఈ సభలకు భారీగా తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, వీరుష్, ఈరన్నలు ఉన్నారు.

'పంచాయతీకి ఆదాయం తీసుకురావాలి'

గోనెగండ్ల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వర్మీకంపోస్టు ద్వారా పంచాయతీకి ఆదాయం తీసుకురావాలని గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, పంచాయతీ కార్యదర్శి సతీష్ అన్నారు. శుక్రవారం చెత్త నుంచి సంపద కేంద్రలో తయారు చేసిన వర్మీకంపోస్టును వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఒక కేజీ వర్మీకంపోస్టు ధర రూ. 15లుగా నిర్ణయించారు. ఇంటి దగ్గర పూల మొక్కలకు గాను 30 కేజీల వర్మీని కొంత మంది ఉద్యోగులు, ప్రజలు కొనుగోలు చేశారు. గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్ మాట్లాడుతూ గ్రామంలోని ఇండ్ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తలకు వాన పాములను జతచేసి వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేశామన్నారు. ఈ వర్మీ కంపోస్టును మిరప, ఉల్లి, పంటలతో పాటు ఇతర పంటలకు కూడా వేయవచ్చునని పంట దిగుబడి అధికంగా వస్తుందని వారు తెలిపారు. 50 కేజి బస్తా రూ. 750గా నిర్ణయించామని చెత్తనుంచి సంపద తయారి కేంద్రంలో 100 (50కేజి) బస్తాలు ఉన్నాయని అవసరమైన రైతులు కొనుగోలు చేసుకొవచ్చునని తెలిపారు. వర్మీ కంపోస్టు ద్వార పంచాయతీ ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ మలాంగ్, సుబాన్, అనిల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన భవన నిర్మాణం జనవరిలో పూర్తి

ఎమ్మిగనూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి కొత్త భవనం నిర్మాణం వచ్చే ఏడాది జనవరిలో పూర్తవుతుందని ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ సుధా శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం పాతభవనంలోనే రోగులకు ఓపీ, ఐపీ, ఆపరేషన్ థియేటర్‌తో పాటు అన్ని రకాల వైద్యసేవలను అందిస్తున్నామన్నారు. పాత భవనంలో స్థలం లేకపోవటం వల్ల పనిచేయని పరికరాలను పాత క్వార్టర్స్‌లో ఉంచామన్నారు. పాత క్వార్టర్స్ ఏవిధంగాను నివాస యోగ్యంగా లేవని మరమ్మతులకు నివేదిక పంపామని తెలిపారు.

కనీస సౌకర్యాలు కరువు

- ప్రభుత్వ కార్యాలయాల దగ్గర తాగునీరు, కుర్చీలు లేవు
- ఆయా పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు తప్పని అవస్థ

గోనెగండ్ల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల దగ్గర కనీససౌకర్యాలు కరువయ్యాయి. దీంతో కార్యాలయాలకు వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీరోజు వందలాది మంది గోనెగండ్ల ప్రభుత్వ కార్యాలయలకు వస్తుంటారు. ఆయా కార్యాలయం దగ్గర కనీస సౌకర్యాలు తాగునీరు, కుర్చేనేందుకు కుర్చీలు, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో కార్యాలయం ప్రాంగణంలోనే మూత్రాన్ని విసర్జిస్తున్నారు. దీంతో పరిసరాల్లో దుర్గంధం వెదల్లుతోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్ కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ అమలులో ఫలితాలు సాధించడంలేదు. మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అద్దె భవనాల్లోనే.. మండలంలోని పలు కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అలాగే కనీస సౌకర్యాలు లేవు.


గోనెగండ్ల ఎంపీడీవో కార్యాలయం


కనీస సౌకర్యాలు లేని తహసీల్దార్ కార్యాలయం

తహసీల్దార్ కార్యాలయం, వ్యవసాయ కార్యాలయం, ఇరిగేషన్ కార్యాలయం, ఇందిరా కాంత్రి పథకం కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. ఇరిగేషన్ భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అలాగే మండలంలోని ఆరోగ్య ఉపకేంద్రాలు, పోస్టాఫీస్ కూడా అద్దెభవనాల్లో ఉన్నాయి. ఎంపీడీవో కార్యాలయానికి సొంత భవనం ఉన్నప్పటికి కనీస సౌకర్యాలు కరువయ్యాయి.

తాగునీరు లేదు

మండలంలో ప్రభుత్వ కార్యాలయాల దగ్గర కనీస సౌకర్యాలు కరువయ్యాయి. తాగునీరు, మరుగుదొడ్లు, లేక ఇబ్బందులు పడుతున్నారు. రోజు వందలాది మంది ప్రజలు కార్యాలయా దగ్గరకు వస్తుంటారు. వారికి కనీస సౌర్యాలు కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారుల పై ఉంది. స్వంతభవనాలు కూడా నిర్మించాల్సి ఉంది. ప్రభుత్వం వెంటనే స్పందించాలి.


కౌలుట్లయ్య నాయుడు, గోనెగండ్ల

మాజీ ప్రధాని మృతి తీరని లోటు


మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎమ్మిగనూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు అని కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జీ కాశీం వలి అన్నారు. శుక్రవారం స్థానిక సోమప్ప సర్కిల్‌లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్, నాయకులు రఫీక్, అన్సర్, హర్ష, విష్ణు, దురంద్, అజయ్, సోమిరెడ్డి, అల్తాఫ్ పాల్గొన్నారు.

కౌతాళం: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల మండలంలో వివిధ పార్టీ నాయకులు, అధికారులు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళి అర్పించారు. కౌతాళంలోని ప్రతిభ హైస్కూల్‌లో పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ దూద్ బాషా మాట్లాడుతూ ఒక గొప్ప నాయకుడిని, ఓ ఆర్థిక మేధావిని కోల్పోయామని సింగ్ సేవలను కొనియాడారు.

మంత్రాలయం: మాజీ ప్రధాని, ఆర్థిక సంస్కరణ నేత మన్మోహన్ సింగ్ మృతి తీరని లోటు అని ఎమ్మెల్యే నాగిరెడ్డి తీవ్ర సంతాపం తెలిపారు. శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అమలు, ఆర్థిక సంస్కరణలు చేసిన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో గురెడ్డి భీమిరెడ్డి, బూదూరు మల్లికార్జున రెడ్డి, పురుషోత్తంరెడ్డి, గురురాజరావు, ప్రహ్లాద దేశాయ్, తెల్లబండ్ల భీమయ్య, రోగప్ప, మేకల నారాయణ, వైస్ ఎంపీపీ రాఘవేంద్ర, శ్రీనివాసులు, జనార్దన్ రెడ్డి, వెంకటేశ్ శెట్టి, వీరనాగుడు తదితరులు పాల్గొన్నారు.

అద్దె చెల్లించని దుకాణం స్వాధీనం

ఎమ్మిగనూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీకి చెందిన ఓ దుకాణం అద్దె చెల్లించకపోవటంతో మార్కెట్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్ కార్యదర్శి పద్మావతి వివరాల మేరకు.. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆనుకొని నిర్మించిన కమర్షియల్ కాంప్లెక్స్‌లో షాప్ నెం 2ను పట్టణానికి చెందిన సలీమా బీ అద్దెకు తీసుకుంది. 2023 డిసెంబరు నుంచి ఇప్పటి వరకు అద్దె చెల్లించలేదు. దీంతో మార్కెట్ అధికారాలు నోటీసు, షోకాజ్ నోటీసు, ఫైనల్ నోటీసు ఇచ్చినా స్పందించలేదు. శుక్రవారం కర్నూలు జిల్లా డీఎంఎ, పోలీసులు, పక్కన వున్న దుకాణాల యజమానుల సమక్షంలో తాళాలు తొలగించి పంచనామా చేసి స్వాధీనం చేసుకున్నారు. కాగా దుకాణా న్ని మున్సిపాలిటీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి అప్పట్లో తన అధికార బ లాన్ని ఉపయోగించుకొని తక్కువ అద్దెకు తన తల్లి పేరుపై తీసుకొని ని ర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏడాదిగా అద్దె చెల్లించకుం డా మార్కెట్ ఆదాయానికి గండి కొట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నా యి.

గోనెగండ్లలో పారిశుధ్య పనులు

గోనెగండ్ల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలో గత రెండు రోజులుగా పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపడుతున్నారు. మురికి కాలువలను శుభ్రం చేయడం, అందులోని చెత్తను గ్రామ శివార్లకు తరలించడం, బ్లీచింగ్ పౌండర్ వీదుల్లో, మురికి కాలుల్లో చల్లడం దోమలు పెరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చర్య లు చేపట్టామని, గ్రామంలో ఏదైన సమస్య ఉంగే తమ దృష్టికి తీసుకురావాలని కార్యదర్శి సతీష్‌కుమర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్ కోరారు.

వైభవంగా ద్వాదశి వేడుకలు

మంత్రాలయం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలు బంగారు రథంపై విహరించారు. శక్రవారం ధనుర్మాసం ద్వాదశి వేడుకలను పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణబోధ పూజామందిరంలో పీఠాధిపతి స్వహస్తాలచే మూల రాములకు విశేష పూజలుచేసి మంగళహారతులు ఇచ్చారు. స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలను ఊరేగించారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.


బంగారు రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

అన్నదానానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన సుజాత అశోక్ అనే భక్తురాలు రూ.లక్ష అన్నదానానికి విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. శక్రవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని నగదును విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల,పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో శ్రీపాధ ఆచార్, గిరిధర్, అనంతపురాణిక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రాజశేఖర్ స్వామి


నియామక పత్రాన్ని అందజేస్తున్న బీజేపీ జిల్లా నాయకులు

నందవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా మఠం రాజశేఖర్ స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం నందవరం మల్లికార్జున స్వామి ఆలయంలో బీజేపీ జిల్లా ఎన్నికల అధికారి దేశాయి చంద్రన్న, భగత్ ఆధ్వర్యంలో బీజేపీ మండల నాయకుల సమక్షంలో సమావేశం జరిగింది. అనంతరం నియామక పత్రాన్ని మండల అధ్యక్షుడికి అందజేశారు. కార్యక్రమం జగ్గాపురం చిన్నఈరన్న, పూలచింత వీరభద్ర స్వామి, వెంకట్రాముడు, గురుజాల అయ్యపురెడ్డి, బీజేపీ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

సంబరాలు మితిమీరితే చర్యలు

గోనెగండ్ల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 31వ తేదీ రాత్రి జరుపుకునే సంబరాలలో మితిమీరితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ గంగాధర్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ సంబరాలు జరుపుకునే వారికి సూచనలు సలహాలు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ఉల్లాసం పేరిట అధిక శబ్దంతో డిజేలు ఏర్పాటు చేవద్దని ద్విచక్రవాహనాలలో త్రిబుల్ రైడింగ్, అతివేగం, ర్యాస్ రైడింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. రోడ్లపై గుమికూడటం, పెయింటింగ్ వేయడం చేయరాదన్నారు. రాత్రి 12.30 దాటిని తరువాత రోడ్డు పై ఎవ్వరు తిరగరాదని, అలా చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సభ్యత్వం నమోదు చేసుకోండి

పెద్దకడుబూరు , డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం పొందే ప్రతి కార్యకర్తకు రూ. 5లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ఏసేపు అన్నారు. శుక్రవారం పెద్దకడబూరులోని సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. కార్యకర్తలు టీడీపీ సభ్యత్వ తీసుకోవాలని ఆయన సూచించారు.

30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయండి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

మంత్రాలయం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని కల్లుదేవకుంట గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బాస్కర్ యాదవ్ అన్నారు. శుక్రవారం కల్లుదేవకుంట రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ సరస్వతికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వారసత్వభూములకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని, మఠం భూములు, దేవాదాయ భూములను భూమిలేని రైతులకు కౌలుకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, హనుమప్ప, మల్లయ్య, భీమేష్, రమేష్, ప్రకాష్, గోవిందు, రవి, ఫరీద్, ఖాజా హుసేన్, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

గోనెగండ్ల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతుల భూసమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తుందని తహసీల్దార్ కుమారస్వామి, డిప్యూటీ తహసీల్దార్ విష్ణు ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని వేముగోడు గ్రామంలో భూ సర్వే గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో ఈ సభకు రైతులు, ప్రజలు పెద్దసంఖ్యలో హజరయ్యారు. గ్రామ రైతులు తమ భూములలో గతంలో సర్వేలు సక్రమంగా నిర్వహించలేదు. మాకు రావాల్సి ఉన్న భూమి ఇక తక్కువగా ఉంది అంటూ కొందరు హద్దు లు సక్రమంగా చూపలేదని, మరి కొందరు ఇలా పలు రకాల సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. పరిశీలించి ఆ సమస్యలను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


కల్లుదేవకుంటలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ సరస్వతి

మంత్రాలయం: రైతుల భూసమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక రెవెన్యూ సదస్సులు అని డిప్యూటీ తహసీల్దార్ సరస్వతి అన్నారు. శుక్రవారం కల్లుదేవకుంట గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసమస్యలున్న వాటి పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ ఆదాం, మండల సర్వేయర్ అశోక్, వీఆర్వో భీముడు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ

పెద్దకడుబూరు , డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురవణి గ్రామంలోని మిరప ,ఉల్లి పంటలలో సమగ్ర సస్య రక్షణ పద్ధతులపై రైతులకు ఉద్యానశాఖాధికారి అపర్ణ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కేవికే సమన్వయకర్త రాఘవేంద్ర చౌదరి, లివింగ్ ఫుడ్ కంపెని అసిస్టెంట్ మేనేజర్ సమంత్ పాల్ మాట్లాడుతూ మిరపలో వచ్చె నల్ల తామర, బూడిద తెగుళ్ల , కాయ కుళ్ల నివారణకు సమగ్ర సస్యరక్షణ అట్టలను అమర్చాలన్నారు. ఎర పంటగా బంతిపూలును 15సాళ్లకు ఒక సాళు వేసుకోవాలన్నారు. జొన్న, సజ్జ పంటలను రక్షణ పంటలుగా వేసుకోవాలన్నారు.సమగ్ర సస్యరక్షణ చర్యల వల్ల పంటలను కాపాడుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది నాగరాజు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాఘవేంద్ర చౌదరి

ఈకేవైసీ చేయించుకోవాలి

ఎమ్మిగనూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని కడిమెట్ల వ్యవసాయ పరపతి సహకార సొసైటీ సభ్యులుగా ఉన్న రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని సొసైటీపర్సన్ ఇన్‌చార్జి శ్రీకాంత్, సీఈవో దత్తాత్రేయ స్వామి శుక్రవారం కోరారు. కడిమెట్ల సొసైటీలో పంట అప్పులు, రైతునేస్తం, రైతు మిత్ర, అప్పు దార్లు తమ గ్రామపరిధిలో ఉన్న సచివాలయంలో ఆధార్ కార్డు, ఫోన్‌కు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈనెల 31 లోపు తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

గోనెగండ్ల, : ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకారం సంఘంలో ఖాతాదారులు సంబంధిత సచివాలయాలలో తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సీనియర్ ఇన్‌స్పెక్టర్ పర్సన్ ఇన్‌చార్జి రమాదేవి కోరారు. ఆమె శుక్రవారం హెచ్ కైరవాడి సహకరా సంఘంలో ఖాతాదారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభు త్వ రాయితీలు లభిస్తాయని ఆమె పేర్కొన్నారు. అలాగే ఓటు హక్కు కూడా ఉంటుందన్నారు. లేక పోతే ఓటు హక్కు కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సున్న వడ్డీ రుణాలు, ఎరువుల కొనుగోలు చేయాలన్నా, పంటను కొనుగోలు చేయాలన్నా ఈకేవైసీ తప్పని సరి అని తెలిపారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి: ఎమ్మెల్యే

మంత్రాలయం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం వైసీపీ రాష్ట్ర పిలుపు మేరకు మంత్రాలయంలో రాఘవేంద్ర సర్కిల్ నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు విద్యుత్ చార్జీల బాదుడుపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్ ఏడీఏ విశ్వశాంతి స్వరూప్, ఏఈ గోవిందులకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజలకు సంక్షేమం అందించాలన్నారు. 2027లో జరిగే జమిలీ ఎన్నికల్లో 5వ సారి ఎమ్మెల్యేగా గెలిచితీరుతానని తెలిపారు. ప్రజల సంక్షేమాన్ని చంద్రబాబు పట్టించుకోవడం లేదని, సంపద సృష్టించి ప్రజలకు అందిస్తానన్న మాటకు కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ గుర్రెడ్డి భీమిరెడ్డి, సర్పంచులు తెల్లబండ్ల భీమయ్య, రామాంజనేయులు, కురువ లింగారెడ్డి, బెస్త ఆంజనేయ, వీరారెడ్డి, పురుషోత్తంరెడ్డి, కరణం గురురాజరావు, జనార్దన్ రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, ప్రహ్లాద దేశాయ్, రోగెప్ప, బెట్టన్నగౌడు, చంద్ర, నాలుగు మండలాల నుంచి వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


మంత్రాలయంలో ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసీపీ నాయకులు

పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎమ్మిగనూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బుట్టరేణుక అన్నారు. వైసీపీ అధిష్టానం ఆదేశాల మేరకు శుక్రవారం శ్రీనివాస సర్కిల్ నుంచి కమిటీ రోడ్డు మీదుగా విద్యుత్ కార్యాలయానికి కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి డీఈ నాగేంద్రప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. బుట్టా రేణుక మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలన్నారు. గృహ వినియోగదారులపై మోపిన రూ.15,48,536 కోట్ల విద్యుత్ చార్జీల బాదుడును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో బహిరంగంగా ప్రజలకు విద్యుత్ చార్జీలు పెంచము వీలైతే తగ్గిస్తామని చెప్పి ఇప్పుడు ప్రజల నడ్డి విరిచేలా కరెంట్ చార్జీలు పెంచడం సరైందికాదన్నారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ రాష్ట్ర అధ్యక్షులు వై రుద్రగౌడ్, మండల కన్వీనర్ బసిరెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత్‌రెడ్డి, శివారెడ్డి, సునీల్,నజీర్ పాల్గొన్నారు.


డీఈకి వినతి పత్రం ఇస్తున్న వైసీపీ ఇన్‌చార్జి బుట్టా రేణుక

చెరుకులపాడులో రెవెన్యూ సదస్సు

వెల్దుర్తి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకులపాడు గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ చంద్రశేఖరవర్మ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు అర్జీలు ఇవ్వాలని తహసీల్దార్ కోరారు. సర్వేయర్ హేమంత్‌రెడ్డి, ఆర్‌ఐ ప్రసాద్, వీఆర్వో రమణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం వజ్రాయుధం


సభ్యత్వ నమోదులో నాయకుడు ఉమాపతి నాయుడు

ఆదోని, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం కార్యకర్తలకు వజ్రాయుధమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు, ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ రామస్వామి అన్నారు. శుక్రవారం అమరావతి నగర్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. రూ.వంద చెల్లిస్తే రెండు సంవత్సరాల వరకు రూ.5లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. సభ్యత్వమున్న వారికి టీడీపీలో గుర్తింపు ఉంటుందన్నారు. కృష్ణారెడ్డి, మమ్మద్. సికిందర్, రామలింగ, మల్లయ్య, నరసింహులు పాల్గొన్నారు.

పట్టణంలో ఆక్రమణల తొలగింపు


మున్సిపల్ మెయిన్ రోడ్డులో తొలగిస్తున్న ఆక్రమణలు

ఆదోని టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారి ఎంఎం రోడ్డులోని ఆక్రమణలను శుక్రవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. కాలువలు దాటి ముందుకు వచ్చిన కట్టడాలను, షాపుల బోర్డులను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. అయితే తమ సామగ్రి, బోర్డులను ధ్వంసం చేశారని, కొందరు దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇప్పటికే పలుమార్లు నోటీసులు ఇచ్చామని ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుడటంతో తొలగింపును ప్రారంభించినట్లు ఏసీసీ కృష్ణసింగ్ తెలిపారు. మిగతా చోట్ల కూడా ఆక్రమణలను తొలగిస్తామన్నారు.

'పది'లో ప్రతిభ చూపాలి


స్టడీ మెటీరియల్ అందిస్తున్న అధికారులు, నాయకులు

మద్దికెర, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ప్రతిభ చూపాలని టీడీపీ జిల్లా కార్యదర్శి గూడూరు ధనుంజయుడు సూచించారు. శుక్రవారం మండలంలోని ఎం.అగ్రహారం జడ్పీ పాఠశాల విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి స్టడీ మెటీరియల్ అందజేశారు. వెనుకబడిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కడవుల రవి, పత్తికొండ మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ పెద్ద వీరన్న, హెచ్ఎం ఎస్ఎండీ ఫరూక్, విశ్వనాథ్, సర్పంచ్ బురుజుల విజయుడు, ఆనంద్ కుమార్, దస్తగిరి, ప్రకాష్ తదితరులు ఉన్నారు

ఆలూరు సమస్యలపై దృష్టి పెట్టండి

- ఆర్డీవో భరత్ నాయక్‌ను కోరిన వీరభద్ర గౌడ్


ఆర్డీవోను సన్మానిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్

ఆలూరు, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ సమస్యలపై దృష్టి పెట్టాలని పత్తికొండ ఆర్డీవో భారత్ నాయక్‌ను ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ కోరారు. ఈమేరకు శుక్రవారం ఆర్డీవోను సన్మానించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని, భూ వివాదాలు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట యార్డ్ మాజీ చైర్మన్ రాంనాథ్ యాదవ్, వైస్ చైర్మన్ సాలి సాహెబ్, నాయకులు రవి, సుధాకర్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

మద్దికెర, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడు దోమలు రావని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, సీహెచ్‌వో నిరంజన్‌బాబు అన్నారు. శుక్రవారం మద్దికెరలో పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు.

పంటలను దెబ్బతీసిన వాతావరణం

- తెగుళ్ల బారిన మిరప, మొక్కజొన్న, వేరుశనగ
- మిరపలో తగ్గిన దిగుబడి, మొక్కజొన్నపై కత్తెర పురుగు దాడి


తాలు కాయలను చూపుతున్న రైతు రాజు, ఇన్‌సెట్‌లో దెబ్బతిన్న మొక్కజొన్న

దేవనకొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో దాదాపు 2 వేల ఎకరాల్లో మిరప, వెయ్యి ఎకరాల్లో మొక్కజొన్న, మూడు వేల ఎకరాల్లో వేరుశనగ, వెయ్యి ఎకరాలు జొన్న, వెయ్యి ఎకరాలకు పైగా శనగ సాగు చేశారు. అయితే వాతావరణం అనుకూలించకపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయి.

మిరప దిగుబడిపై ప్రభావం

వాతావరణ ప్రభావం మిరప దిగుబడిపై పడింది. తాలు కాయ, నల్లమచ్చ రావడతో ధర రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటపై ఎర్ర, తెల్లనల్లి, ఆకు ముడత వైరస్ దాడి చేశాయి. అలాగే మొక్కజొన్న, వేరుశనగ పంటలపై లద్దె పురుగు(కత్తెరపురుగు) తాకిడి ఉంది. ఈ పురుగు ఆకులు, సుడిని కొరికేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మందులు పిచికారి చేసినా...

వైరస్, ఆకుముడత, తెల్ల, ఎర్ర నల్లి, బుడిద తెగుళ్లు, వేరుకుళ్లు, శిలీంధ్ర నాశని తదితర తెగుళ్లు పంటను ఆశించాయి. వీటి నివారణకు వారంలో రెండు సార్లు మందులు పిచికారి చేసిన ప్రయోజనం లేదని రైతులు వాపోతున్నారు. రైతుల కష్టాలను ఆసరాగా చేసుకున్న దుకాణదారులు బయో మందులు అంటకడుతున్నారని ఆరోపణలున్నాయి. .

అధిక తేమ లేకుండా చూసుకోవాలి



మిరపలో ఎకరాకు 40 నుంచి 50 నీలి, పసుపు రంగు జిగురు అట్టలు అమర్చాలి, వేపనూనె పిచికారీ చేయాలి. తామర పురుగు ఉధృతి ఉంటే డైమిథోయేట్ 30 శాతం ఇ.సి. 2 మీ.లీ లీటరుకు, లేదా ఫిప్రో నిల్ 40 శాతం మరియు ఇమిడా క్లోప్రిడ్ 40 శాతం, డబ్ల్యూజీ 0.30 గ్రా. లీటరు కలపాలి. నల్లి నివారణకు ఇతియాన్ 50 శాతం ఇ.సి 2.5 మీ.లి లేదా ప్రాపర్గైట్ 57శాతం, ఇ.సి0.50 మీ.లీ లీటరు నీటికి కలిపి, ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

\- దస్తగిరి, ఉద్యాన అధికారి

ఈకేవైసీ తప్పనిసరి చేయించుకోవాలి

పత్తికొండ టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సహకార సొసైటీ ఖాతాదారులకు ఈకేవైసీ తప్పనిసరి అని సీనియర్ ఇన్‌స్పెక్టర్ పర్సన్ ఇన్‌చార్జి అశోక్ కుమార్ తెలిపారు. శుక్రవారం సహకార పరపతి సంఘంలో సమావేశం నిర్వహించారు.

దేవనకొండ: సభ్యులు సచివాలయంలో ఈకేవైసీ చేయించుకోవాలని సీఈవో రహ్మతుల్లా సూచించారు. మండలంలో 6,500పైగా సభ్యులు ఉన్నారని, ఈకెవైసీ చేసుకుంటేనే ఓటు హక్కు ఉంటుందన్నారు.

ఆలూరు : ఆలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలో ఉన్న రైతులు ఆయా గ్రామాల్లో ఉన్న సచివాలయాల్లో ఈకెవైసీ చేయించుకోవాలని ఆలూరు సహకార సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సీఈవో వెంకట్ రెడ్డి శుక్రవారం కోరారు. రైతులు ఈ కెవైసీ చేయించుకుంటే రుణాలు ఇచ్చేందుకు, ఎన్నికల్లో పాల్గొనేందుకు, పోటీ చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. విషయాన్ని రైతులు గమనించాలని కోరారు...

విద్యుత్ చార్జీల పెంపునకు జగనే కారణం

- ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి):



విద్యుత్ చార్జీలు పెంచడానికి జగనే కారణమని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 2019లో టీడీపీ అధికారం కోల్పోయే నాటికి మిగులు విద్యుత్ ఉన్న రాష్ట్రంగా జగన్ మోహన్ రెడ్డికి అప్పగిస్తే ఐదేళ్లలో అనాలోచిత నిర్ణయాలతో అధోగతిపాలు చేశారని విమర్శించారు. పీఏలను రద్దు చేయడంతో పాటు సోలార్, విండ్ పవర్ పెట్టుబడిదారులను బెదిరించి రాష్ట్రం నుంచి వెళ్లగొట్టారన్నారు. దీంతో రాష్ట్రం 10వేల మెగా వాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను కోల్పోయిందన్నారు. విద్యుత్ ఉత్పత్తికి మారుపేరుగా ఉండే ఏపీ జెన్‌కోను జగన్ రెడ్డి సర్వనాశనం చేశారని ఆరోపించారు. విజయసాయి రెడ్డి అండ్‌కో నుంచి అధిక రేట్లకు విద్యుత్ కొనుగోలు చేశారని, యూనిట్‌ను రూ.8ల నుంచి రూ.14లవరకు జగన్ బ్యాచ్ కొనుగోలు చేసిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎడాపెడా విద్యుత్ కొనుగోళ్లు చేసి, ఆ భారాన్ని ప్రజలపై వేయాలని అధికారంలో ఉన్నప్పుడే జగన్ ఈ ఆర్సీని కోరారని ఎమ్మెల్యే గుర్తు చేశారు.

ప్రజలను మోసం చేశారు

- ఆదోని, ఆలూరు, పత్తికొండలో వైసీపీ నాయకుల నిరసన


ఆదోనిలో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుల బైక్ ర్యాలీ



ఆలూరులో లాంతర్లతో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఆదోని, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ భారం మోపి మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ ఆరోపించారు. శుక్రవారం వైసీపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఈఈ హరి, ఏడీఈ పురుషోత్తంకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో చంద్రకాంత్ రెడ్డి, శేషిరెడ్డి, రామలింగేశ్వర యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, మహిళా నాయకురాలు శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.


పత్తికొండలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

విద్యుత్ చార్జీల పెంపు అన్యాయం

ఆలూరు: విద్యుత్ చార్జీల పెంపు అన్యాయని కూటమి ప్రభుత్వం మాట తప్పిందని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శశికళ కృష్ణ మోహన్ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలో లాంతర్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి, డీఈఈ సంతోష్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. దేవనకొండ జడ్పీటీసీ కిట్టు, చిప్పగిరి మండల కన్వీనర్ మారయ్య, వైసీపీ నాయకులు శేషప్ప, మధుసూదన్ రెడ్డి, జటప్ప గారి వీరేశ్, వెంకటేశ్వరులు, భాస్కర్, వీరేష్, గిరి, వరుణ్, రాజు, శేఖర్ షఫీవుల్ల పాల్గొన్నారు.

సంపద సృష్టించడమంటే భారం మోపడమా?

పత్తికొండ టౌన్: సంపద సృష్టించడమంటే పేదలపై భారం మోపడమా అని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అంబేడ్కర్ సర్కిల్ నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నాలో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రెండుసార్లు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై రూ.15వేల కోట్లు పెనుభారం మోపిందని ఆరోపించారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఎంపీపీలు నారాయణదాసు, వెంకట్రామిరెడ్డి, జడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్లు నాగరాజు, గిత్తా నాగేష్, వెంకట్రాముడు, మాజీ సర్పంచ్ సోమశేఖర్, గాంధీరెడ్డి, బాబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ ధర్నాకు ఆ పార్టీ నాయకులు రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, అనుచరులు పాల్గొనలేదు.

మన్మోహన్ సేవలు ప్రశంసనీయం


ఆదోనిలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆదోని టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థికాభివృద్ధిలో మన్మోహన్ సింగ్ సేవలు ప్రశంసనీయమని మాజీ కౌన్సిలర్ దిలీప్ ధోక అన్నారు. శుక్రవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళి అర్పించారు. ఆయన సేవలను పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తున్నారని తెలిపారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ రావు, పట్టణ యువజన అధ్యక్షుడు దేవి శెట్టి వీరేష్, విద్యార్థి విభాగం నాయకుడు శ్రీనిత్, ఎస్సీ సెల్ నాయకులు మాణిక్యరాజు, నిసార్ అహ్మద్ పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ మరణం తీరని లోటు

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దేశానికి, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పార్టీ రాష్ట్ర ఓబీసీ కో ఆర్డినేటర్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్ అన్నారు. మన్మోహన్ సింగ్ ఇక లేరంటే బాధగా ఉందన్నారు. నసీరుద్దీన్ పటేల్, తాయన్న పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్‌కు ఎమ్మెల్యే నివాళి

ఆలూరు: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి బాధాకరమని ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. శుక్రవారం ఆలూరులో నివాళి అర్పించారు. రాజకీయాల్లో నిస్వార్థ సేవలు అందించిన మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయమన్నారు. వైసీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శశికళ కృష్ణ మోహన్, మండల కన్వీనర్ మారయ్య, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

'ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారు'

ఆదోని: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారని మైనార్టీ సమితి కార్యదర్శి నూర్ అహ్మద్ అన్నారు. బంగా రాన్ని విదేశాలకు కుదువ పెట్టిన పరిస్థితుల్లో ఆర్థిక మంత్రిగా పనిచేసి, విదేశీ పెట్టుబ డులను ఆహ్వానిస్తూనే స్వదేశీ కంపెనీలకు నష్టం కలగకుండా చేశారన్నారు. ఆయన మృతి దేశానికి దేశానికి తీరనిలోటని సంతాపం తెలిపారు.

పండ్ల తోటలతో ఆర్థికంగా ఎదగాలి

దేవనకొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులు పండ్లతోటల సాగుతో ఆర్థికంగా ఎదగాలని సేట్రీస్ టెక్నికల్‌అధికారి హోమేంద్ర ,సీఐ వంశీనాథ్ సూచించారు. కప్పట్రాళ్ల లోని తానా శ్రీశక్తి భవనంలో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంచాలని నిర్వహణ, తెగుళ్ల నివార ణపై అవగాహన కల్పించారు. అనంతరం 45 మంది రైతులకు మామిడి, బత్తాయి, అంజూర, జామ, ఉసిరి, మహాగని, టేకు, టెంకాయ మొక్కలతో పాటు పంటకు అవసరమైన కత్తెరలు పంపిణీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో దత్తపుత్రుడు ఈగల్ ఐజీ ఆకే. రవికృష్ణ రైతులతో మాట్లాడారు. సేట్రీస్ ప్రోగ్రాం మేనేజర్ నారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు రూపమ్మ, సుధాకర్, మద్దయ్య పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే లక్ష్యం

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఆనంద్ రాజ్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని న్యాక్ శిక్షణ కేంద్రంలో జాబ్ మేళా నిర్వహించారు. 78 మంది పాల్గొనగా 25 మందికి ఉద్యోగాలు కల్పించారు. ఇన్‌చార్జి ఉల్లిగన్న, రాజశేఖర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ గడువు పెంపు

ఆదోని టౌన్, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ (లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) గడువును వచ్చే ఏడాది మార్చి 31 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. పట్టణ పరిధిలోని నాన్ లేఔట్ల ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు 2020లో ప్రభుత్వం ఈ స్కీమ్‌ను ప్రవేశ పెట్టింది. ఇంకా దరఖాస్తు చేయనివారికి అవకాశం కల్పించింది. ఆదోని పట్టణ పరిధిలో మొత్తం 80మంది దరఖాస్తు చేసుకోగా అందులో 68 మంజూరయ్యాయి. ఒక దరఖాస్తును తిరస్కరించగా, 11దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయి. అనుమతి పొందని వారు దరఖాస్తు చేసుకోవాలని, గడువు అనంతరం చర్యలు ఉంటాయని మున్సిపల్ ఏసీపీ కృష్ణసింగ్ శుక్రవారం తెలిపారు.

సీపీఐ శత వార్షికోత్సవాలు

వెల్దుర్తి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లుగుండు గ్రామంలో శుక్రవారం భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ఉత్సవాలు శుక్రవారం నిర్వహించారు. మండల కార్యదర్శి కృష్ణ పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో రాజు, చిన్నమాదులు, ఎల్లప్పీను, ఆంజనేయులు, మహేశ్, బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మద్దికెరలో డెంగీ కేసు

మద్దికెర, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని చాకలి వీధిలో ఒకరికి డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి శివకుమార్, వైద్య బృంధం దోమల మందును పిచికారీ చేయించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తుపాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. జబ్బు వస్తే వెంటనే వైద్యశాలలకు వెళ్లాలని కోరారు. విజయ్ ఉన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఆలూరు రూరల్, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గోవింద్ సింగ్ కోరారు. శుక్రవారం మునహళ్లి గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్పంచ్ పార్వతి, టీడీపీ నాయకులు గోపాల్, సోమశేఖర్, సర్వేయర్ అరుణ జ్యోతి, వీఆర్‌వోలు పాల్గొన్నారు

సమస్యలను పరిష్కరిస్తాం

తుగ్గలి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ రమాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని రాతనలో రెవెన్యూ సదస్సు నిర్వమించారు. తహసీల్దార్ 9 అర్జీలు వచ్చాయని, రికార్డులను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. డీటీ నాగరాజు, టీడీపీ నాయకులు మనోహర్ చౌదరి, క్రిష్ణమూర్తి చౌదరి ఉన్నారు.

అవినీతిని సహించలేక ప్రజలు ఓడించారు

- మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిపై దేవేంద్రప్ప ఆగ్రహం



ఆదోని, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, కుమారుడు మనోజ్ రెడ్డి అవినీతి, అరాచకరాలను సహించలేక ప్రజలు ఓడించారని కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ హయాంలో రైతులను నిండా ముంచి, నేడు విద్యుత్ చార్జీలను తగ్గించాలని ధర్నాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంలో పది దఫాలు విద్యుత్ చార్జీలు పెంచి, పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రోడ్లు బాగోలేవన్నందుకు ఆటోడ్రైవర్ రవిని ఇంటికి తీసుకెళ్లి చితకబాదింది మీరు కాదా? అని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిని ప్రశ్నించారు. అలాగే మహేష్ యాదవ్ అనే వ్యక్తి ఇంటికి వెళ్లి వైసీపీ నాయకులు దాడిచేసి బెదిరించారని, మాజీ ఎమ్మెల్యే ఓసారి గుర్తుకు చేసుకోవాలని హితవు పలికారు. పేదల ఆస్తులను కబ్జా చేశారని, బైపాస్ రోడ్డులో కురువలకు సంబంధించిన భూమిని మీ అనుచరుడు కబ్జా చేయలేదా అన్నారు. పేదలకు పంపిణీ చేసే బియ్యాన్ని మీ తనయుడు కర్ణాటకకు తరలించి రూ.కోట్లు సంపాదించాడని ఆరోపించారు. అనుకూలమైన అధికారులకు పోస్టింగ్ ఇప్పించి, అవినీతికి కొమ్ము కాశారన్నారు. కూటమి ఎమ్మెల్యే పార్థసారథి తాను చెబితే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చెప్పినట్టే అన్న వ్యాఖ్యలు కార్యకర్తలను ఉత్తేజ పరచడానికేనన్నారు. వైసీపీ ప్రభుత్వం లో అన్యాయానికి గురైన పేదలకు న్యాయం చేస్తామన్నారు. టీడీపీ నాయకులు నాగరాజు, సిద్ద, గర్జప్ప పాల్గొన్నారు.



హిందూ ధర్మం గొప్పది

- సనాతన ధర్మ ప్రచారకర్త శ్రీమాన్ రాధామనోహర్ దాస్


మాట్లాడుతున్న శ్రీమాన్ రాధామనోహర్ దాస్

పత్తికొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మం గొప్పదని, రక్షించుకోవాలని సనాతన ధర్మ ప్రచారకర్త శ్రీమాన్ రాధా మనోహర్ దాస్ అన్నారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. ఆలయాల పరిరక్షణకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఒక్కోసారి అధర్మం గెలిచినట్లు కనిపిస్తుంటుందని అయితే చివరకు ధర్మమే గెలుస్తుందని అన్నారు. మన ఇళ్లలో పిల్లలకు హిందూ ధర్మాన్ని చెప్పడంతోపాటు భగవద్గీత చదివించాలన్నారు. కనీసం నలుగురు పిల్లలను కనాలన్నారు. త్వరలో సినీ నటులను కలిసి హిందూ ధర్మం గురించి మాట్లాడతానన్నారు. అనంతరం హైందవ పాచజన్య బిరుదుతో సత్కరించారు. వీహెచ్‌పీ నాయకుడు నందిసాయిరెడ్డి, శాకారుడు రంగారెడ్డి. అధ్యాపకుడు రాజాజయచంద్ర, వీర్రాజు, గోవర్ధన్, నరేష్ పాల్గొన్నారు.

దేశ సంస్కృతిని కాపాడుకుందాం

పత్తికొండ టౌన్, దేశ సంస్కృతిని కాపాడుకుందామని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి అన్నారు. టీటీడీ, ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధార్మిక, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రూ.2.01 కోట్లతో రోడ్ల గుంతలు పూడ్చివేత

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆర్అండ్‌బీ డీఈ శివరుద్ర కుమార్



పత్తికొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రోడ్ల ప్యాచ్ వర్కులకు 2.01కోట్ల నిధులతో 104 కి.మీ.ల మేర రోడ్ల గుంతలు పూడ్చి వేస్తున్నామని ఆర్అండ్‌బీ డీఈ శివరుద్రకుమార్ అన్నారు. ఆయనతో ఆంధ్రజ్యోతి కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: నియోజకవర్గ పరిధిలో రోడ్లపరిస్థితి ఎలాఉంది?

జవాబు: దెబ్బతిన్న రోడ్లకు రమ్మతులు చేస్తున్నాం

ప్రశ్న: నూతన రహదారులకు ప్రతిపాదనలు పంపారా?

జవాబు: పత్తికొండ నుంచి ప్యాపిలికి, మద్దికెర నుంచి పత్తికొండ మీదుగా దేవనకొండ వరకు రెండు రహదారులను డబుల్ రోడ్డుగా మార్చాలని ఎమ్మెల్యే శ్యాంబాబు ఆర్అండ్‌బీ మంత్రికి విన్నవించారు. ఇందుకు సంబంధించి అంచనా వ్యయాలను ప్రభుత్వానికి పంపాం

ప్రశ్న: పత్తికొండ పట్టణంలో రహదారి విస్తరణ పనులు చేస్తున్నారా?

జవాబు: పట్టణంలో రహదారి విస్తరణకు గతంలోనే సర్వే చేశాం. నిర్మాణాలను నష్టపోయే వారికి పరిహారం ఇచ్చే విషయం కూడా పూర్తయింది. ప్రభుత్వం నుంచి నిదులు మంజూరు కాగానే పరిహారం చెల్లించి రహదారి విస్తరణ పనులు ప్రారంభిస్తాం.